ములుగు జిల్లా ఏటూరునాగారం ఐటీడీఏ ఎదుట విద్యార్థుల నిరసన ధర్నా..





# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd


భక్తిశ్రద్ధలతో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించాలి





Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 254 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 09 రూ - 03/- మంగళవారం 08 సెప్టెంబర్ 2026




## రాష్ట్రాన్ని పెట్టుబడుల గమ్యస్థానంగా మారుస్తాం

**'గ్లోబల్ సమ్మిట్'పై సమీక్షలో సీఎస్ సంజయ్ జాజు**

**హైదరాబాద్ సెప్టెంబర్ 7(పిసిడబ్ల్యూ న్యూస్):** 'ఇన్వెస్ట్ తెలంగాణ' పేరుతో నిర్వహించనున్న ఈ గ్లోబల్ సమ్మిట్ ద్వారా తెలంగాణలోని పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి విస్తృతంగా పరిచయం చేయడంతో పాటు రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయి పెట్టుబడుల గమ్యస్థానంగా మరింతగా ప్రతిష్టించేందుకు కృషి చేయాలని సీఎస్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి సన్నాహకాలను సమీక్షించారు. రానున్న ఇన్వెస్ట్ తెలంగాణ – తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2026 నిర్వహణకు

మిగతా2లో...

## కోటి ఓట్ల తొలగింపునకు కుట్ర

- బీజేపీ వ్యతిరేక ఓట్లపై ప్రత్యేక నిఘా
- కొడంగల్‌లో 81 వేల ఓట్లు గల్లంతు
- పేదలు, గిరిజనుల ఓట్లపైనా కుట్ర
- దీనిపై లౌకిక శక్తులు ఏకం కావాలి
- సర్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ సెప్టెంబర్ 7(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో కోటి ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యతిరేక ఓటర్లను గుర్తించేందుకు బీజేపీ ప్రత్యేక ఏజెన్సీలను ఏర్పాటు చేసిందని విమర్శించారు. 2009 నుంచి ఓటింగ్ సరళిని పరిశీలించి బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నవారి ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. రవీంద్రభారతిలో నేడు రైతు నేత సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. నరేంద్ర మోదీ విధానాలకు వ్యతిరేకంగా వ్యవస్థ మొత్తం సిద్ధమవుతోందని అన్నారు. అందుకే ఎస్ఐఆర్ పేరుతో కొత్త కుట్రలకు తెరలేపారని ఆరోపించారు. తెలంగాణలో కోటి ఓట్లు తొలగిస్తున్నా బీఆర్ఎస్ స్పందించడం లేదని మండిపడ్డారు. తన నియోజకవర్గం కొడంగల్‌లో వలస వెళ్లిన వేలాది

మిగతా2లో...


## పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు ఒకే నిబంధన

**- గ్యాస్ వినియోగదారులకు కేంద్రం తీపికబురు**



**న్యూఢిల్లీ, 7(పిసిడబ్ల్యూ న్యూస్):** వంట గ్యాస్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఇక గ్రామీణ ప్రాంతాల్లోనూ 25 రోజులకే ఎల్‌పీజీ సిలిండర్ రీఫిల్ బుక్ చేసుకోవచ్చు. ఇప్పటివరకు అక్కడ 45 రోజుల వ్యవధి ఉండేది. పట్టణ, గ్రామీణ ప్రాంతాలన్నింటికీ ఇక 25 రోజుల నిబంధనే అమల్లో ఉంటుంది. ఈ మార్పును మిగతా2లో...

## తెలంగాణలో 'సర్' గడువు మరోసారి పొడిగింపు




**హైదరాబాద్ సెప్టెంబర్ 7(పిసిడబ్ల్యూ న్యూస్):** మరోసారి సమగ్ర ఓటర్ జాబితా(సర్) ప్రక్రియ గడువును ఎన్నికల సంఘం పెంచింది. క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణకు ఉన్న గడువును పొడిగించింది. ముందుగా ఈ నెల 16 వరకు ఉన్న గడువును అక్టోబర్ 7 వరకు

మిగతా2లో...

## మహిళా ఎమ్మెల్యేలపై దాడికి రేవంత్‌రెడ్డిదే బాధ్యత

- పోలీసులపై చర్యలు తీసుకోవాలి :బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- సీఎం క్షమాపణ చెప్పేదాకా వదిలిపెట్టం
- ఇదేనా ఇందిరమ్మ ప్రజాపాలన ?
- బీఏసీ సమావేశం బహిష్కరణ



**హైదరాబాద్ సెప్టెంబర్ 7(పిసిడబ్ల్యూ న్యూస్):** మహిళా ఎమ్మెల్యేలపై దాడికి సీఎం రేవంత్‌రెడ్డిదే పూర్తి బాధ్యత అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారక రామారావు (కేటీఆర్) అన్నారు. సీఎం క్షమాపణ చెప్పేదాకా వదిలిపెట్టబోమని చెప్పారు. ఆడబిడ్డల చీరలు లాగి గొంతులు పట్టి జుట్టు లాగడమే ఇందిరమ్మ ప్రజాపాలన అని ప్రశ్నించారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ వెయ్యి రోజుల ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామనే భయంతోనే ప్రభుత్వం తమను అడ్డుకుందని చెప్పారు. రాహుల్‌గాంధీకి ఒక నిబంధన, తమకు మరో నిబంధన వర్తిస్తుందా?అని మిగతా2లో...

## ఆరావళి కొండల నిర్వచనం.. హైపవర్ కమిటీ గడువు పొడిగింపు

**హైదరాబాద్ సెప్టెంబర్ 7(పిసిడబ్ల్యూ న్యూస్):** ఆరావళి కొండల నిర్వచనం, సరిహద్దుల నిర్ధారణపై సుప్రీంకోర్టు హైపవర్ కమిటీ(హెచ్‌పీసీ)ని నియమించిన విషయం తెలిసిందే. సదురు ఉన్నత స్థాయి కమిటీ నివేదిక సమర్పణపై గడువు పొడిగించాలని ఉన్నత న్యాయస్థానాన్ని కోరింది. ఈ మేరకు సోమవారం ఈ ఏడాది నవంబర్ 30 వరకు ధర్మాసనం మిగతా2లో...



## అసెంబ్లీకి వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దు

**- రాష్ట్ర హోం శాఖకు తెలంగాణ హైకోర్టు నోటీసులు**






## ప్రారంభమైన తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు

- నిషేధిత భూములు 22ఏ జాబితాపై సభలో రగడ
- ప్లకార్డులు ప్రదర్శిస్తూ సభలో బీజేపీ నినాదాలు
- 22ఏ అంశంపై చర్చకు పూర్తిగా సిద్ధంగా ఉన్నాం
- సభ సజావుగా సాగేందుకు సహకరించాలి
- 22ఏ జాబితాపై మంత్రి శ్రీధర్ బాబు వివరణ
- వచ్చే బోనాల నాటికి ఇందిరమ్మ ఇళ్లు పూర్తి
- అసెంబ్లీలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్ సెప్టెంబర్ 7(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన వెంటనే నిషేధిత భూములు 22ఏ జాబితా వ్యవహారంపై సభలో రగడ మొదలైంది. 22ఏ నిషేధిత భూముల నిబంధన కింద ప్రైవేట్ భూముల నమోదుపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని బీజేపీ ఎమ్మెల్యేలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ సభలో నినాదాలు చేశారు. ఈ వివాదంపై తక్షణమే విచారణ కమిటీని వేయాలని బీజేపీ సభ్యులు ప్రభుత్వాన్ని పట్టుబట్టారు. ఈ ఆందోళనపై శాసనసభా వ్యవహారాల శాఖ మిగతా2లో...

## తాతా మధును బీఆర్ఎస్ డిస్మిస్ చేయాలి

**- సీఎం రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్ సెప్టెంబర్ 7(పిసిడబ్ల్యూ న్యూస్):** శాసనసభ స్పీకర్ పట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలపై అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. దళిత వ్యక్తిని ప్రతిపక్ష నేతగా మిగతా2లో...

## అసెంబ్లీలో స్పీకర్ కంటతడి



**హైదరాబాద్ సెప్టెంబర్ 7(పిసిడబ్ల్యూ న్యూస్):** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అనుచిత వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎమ్మె ల్యేలు, మంత్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్పీకర్‌ను కలిసి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సంఘీ భావం తెలిపారు. ఈక్రమంలోనే స్పీకర్ భావోద్వేనికి గురైయ్యారు. స్పీకర్ గౌరవాన్ని కాపాడే బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. బీజేపీకి కూడా బాధ్యత ఉందని చెప్పారు. బీజేపీ నేతలు సభకు సహకరించాలని కోరారు. స్పీకర్‌ను బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అవమానిం చడంపై బీజేపీ వైఖరి చెప్పాల ని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ సభ్యులు సభలో ఇష్టారాజ్యంగా వ్యవ హరిస్తున్నారని ధ్వజ మెత్తారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమని అన్నారు. అధికా రంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ రూల్స్ పాటించలేదని.. ఇప్పుడు ప్రతిపక్షంలోనూ రూల్స్ పాటించట్లేదని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆగ్రహించారు. అయితే, స్పీకర్‌పై తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేసిన వీడియోను సీఎంవో విడుదల చేసింది.

# మహిళా ఎమ్మెల్యేలపై దాడికి రేవంత్‌రెడ్డిదే బాధ్యత

(మొదటి పేజీ తరువాయి)

ప్రశ్నించారు. దళిత, మహిళా వ్యతిరేకి ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. దళితులపై చిత్తశుద్ధి ఉంటే దళిత, గిరిజన డిక్లరేషన్లపై అసెంబ్లీలో చర్చకు సిద్ధమా?అని సవాల్ విసిరారు. ప్రభుత్వ దమనకాండకు వ్యతిరేకంగా బీఏసీ సమావేశాన్ని బహిష్కరించామని చెప్పారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై హైకోర్టును ఆశ్రయించామనీ, ఎస్సీ, ఎస్టీ, మహిళా, మానవ హక్కుల కమిషన్లకు వెళ్తామని అన్నారు. సీఎం కూడా ఎమ్మెల్యేనే అనీ, స్పీకర్ పక్షపాత వైఖరిని వీడాలని డిమాండ్ చేశారు.నెలరోజులపాటు అసెంబ్లీ సమావేశాలను నడపాలని కోరారు.

యాదవరెడ్డి, జగదీశ్‌రెడ్డి, శంభీపూర్ రాజు, సంజయ్, హరీశ్‌రావుతోపాటు తనను కూడా పోలీసులు గాయపరుస్తూ ఈడ్చుకుంటూ తీసుకెళ్లారని అన్నారు. మహిళా ఎమ్మెల్యేలపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకునే వరకు పోరాటం కొనసాగుతుందన్నారు.

**జగదీశ్‌రెడ్డికి కేటీఆర్ పరామర్శ** అసెంబ్లీ వద్ద సోమవారం ఉదయం జరిగిన తోపులాటలో అస్వస్థతకు గురై నిమ్స్ ఆస్పత్రితో చికిత్స పొందుతున్న మాజీమంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని కేటీఆర్ పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనా చారి, మాజీమంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కోటి ఓట్ల తొలగింపునకు కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

మంది పేదల ఓట్లను తొలగిస్తున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. కొడంగల్‌లో 81 వేల ఓట్లను అనామలీస్ జాబితాలో చేర్చారని తెలిపారు. ప్రస్తుత ఓట్లతోనే 2029లో మోదీ ఓటమికి పునాది పడుతుందని అన్నారు. బీజేపీ వ్యతిరేక ఓట్లు అంటే మైనార్టీలవే అనుకోవద్దని సీఎం చెప్పారు. పేదలు, గిరిజనుల ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. జాతీయ స్థాయిలో లౌకిక శక్తులు ఏకమై మోదీకి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. రైతుల కోసం జీవితాన్ని అంకితం చేసిన సారంపల్లి మల్లారెడ్డి మరణం రైతాంగానికి తీరని లోటని సీఎం అన్నారు. రైతు సమస్యలపై అవగాహన ఉన్న నాయకత్వం క్రమంగా తగ్గుతోందని పేర్కొన్నారు. కౌలు రైతులు, గిట్టుబాటు ధరలు సహా అనేక రైతు సమస్యలపై సారంపల్లికి అపారమైన అవగాహన ఉందని కొనియాడారు. కమ్యూనిస్టు ఉద్యమాల పోరాటాల వల్లే కాంగ్రెస్ పలు చట్టాలు తీసుకొచ్చిందని రేవంత్ రెడ్డి అన్నారు.

కార్మికులు, పేదల సమస్యలపై కమ్యూనిస్టులు చేసిన పోరాటాలు తమ ప్రభుత్వ ఏర్పాటుకు ప్రత్యక్షంగా, పరోక్షంగా దోహదపడ్డాయని చెప్పారు. తెలంగాణలో సర్? ప్రక్రియ మొదలవ్వకముందు ప్రధాన ప్రతిపక్షం మాట్లాడింది. కోటి ఓట్లు తొలగించిన తర్వాత సర్?కు వ్యతిరేకంగా వారు ఒక్కమాట కూడా మాట్లాడటం లేదు. బీజేపీ కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నప్పుడు ప్రధాన ప్రతిపక్షం ఆ అంశాన్ని లేవనెత్తడం లేదు. 2029లో జరగబోవు ఎన్నికల్లో నరేంద్రమోదీ ఓటమికి ఈ ఓట్లతోనే పునాది పడుతుంది.

ఈ ఓట్లు తొలగిస్తే మోదీకి వెయ్యేనుగుల బలం చేకూరుతుంది. ఎన్నికలు ఎప్పుడో ఉన్నాయి అప్పుడు చూద్దామనుకోవద్దు. గెలుపోటములను నిర్ణయించేంది ఎస్?ఐఆర్ అని అన్నారు. వ్యవసాయం గురించి సాధికారంగా మాట్లాడగలిగిన వ్యక్తి సారంపల్లి మల్లారెడ్డి అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. భూమిలోని సారం నుంచి మొదలుపెట్టి నీరు, విత్తనం, పెట్టుబడి, పంట, గిట్టుబాటు ధర.. అన్ని అంశాలు కూలంకషంగా చెప్పేవారని గుర్తుచేశారు. వ్యవసాయం గురించి అవగాహన కోసం సారంపల్లి మల్లారెడ్డి రాసిన పుస్తకాలు చదివానని తెలిపారు. సారంపల్లి మల్లారెడ్డిని తక్కువసార్లే కలిసినప్పటికీ, ఆయన అంటే అపారమైన గౌరవం ఉందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కమ్యూని స్టుల పోరాటాలు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు ఉపయోగపడ్డాయని చెప్పారు.దున్నేవాడికే భూమి అంటూ ఎన్నో రైతు సమస్యలపై కమ్యూనిస్టులు పోరాడారని రేవంత్ రెడ్డి కొనియాడారు. కమ్యూని స్టులు అంటే తనకు పరోక్షంగా చాలా అభిమానమని వివరించారు. అసైన్డ్?, పోడు పట్టాలు దక్కాయంటే పోరాటం కమ్యూనిస్టులది, పరిష్కారం కాంగ్రెస్?దని వివరించారు. వారి ఉద్యమాల ఫలితంగానే కాంగ్రెస్ అనేక చట్టాలు తెచ్చిందని గుర్తుచేశారు.

# ప్రారంభమైన తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పందించారు. 22ఏ అంశంపై సభలో స్వల్పకాలిక చర్చ చేపట్టేందుకు తమ ప్రభుత్వం సంపూర్ణ సిద్ధంగా ఉందన్నారు.

బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఈ అంశానికి తొలి ప్రాధాన్యత ఇస్తామని, నిబంధనలకు అనుగుణంగా చర్చపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం సభను అడ్డుకోవడం సరికాదని, సమావేశాలు సజావుగా సాగేందుకు సహకరించాలని బీజేపీ ఎమ్మెల్యేలకు ఆయన విజ్ఞప్తి చేశారు. అయితే స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి శ్రీధర్ బాబు సర్దిచెప్పినప్పటికీ బీజేపీ ఎమ్మెల్యేలు వెనక్కి తగ్గకుండా పోడియం వద్ద కాసేపు నినాదాలు చేశారు. విచారణకు నిర్ణయం తీసుకుంటున్నట్లు ప్రకటన చేసేవరకు వెనక్కి తగ్గేదే లేదని స్పష్టం చేయడంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. దాంతో తెలంగాణ అసెంబ్లీ 15 నిమిషాల పాటు వాయిదా వేశారు.

ఆ తరువాత సభ ప్రారంభం కాగా, బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కయ్యాయని బయట వాళ్లు, లోపల వీళ్లు ఆందోళనకు దిగుతున్నారంటూ కాంగ్రెస్ సభ్యులు వ్యాఖ్యానించారు. సభలో ప్రజా సమస్యల పరిష్కారానికి, అర్థవంతమైన చర్చలకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కై సభా సమయాన్ని వృథా చేస్తున్నాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఎస్సీల అభివృద్ధితో పాటు ఫీజు రీయింబర్స్మెంట్, క్రీడల అభివృద్ధి వంటి కీలక అంశాలపై ప్రభుత్వం చర్చకు సిద్ధంగా ఉన్నా... వాటిని వదిలేసి బురదజల్లే రాజకీయం చేయడం ప్రతిపక్షాలకు తగదని సూచించారు.

రాష్ట్రంలో కీలకమైన కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన లక్ష కోట్ల కుంభకోణంపై విచారణ కోరుతూ తెలంగాణ ప్రభుత్వం ఏడాది క్రితమే కేంద్రానికి లేఖ రాసినా... ఆ ఎంక్వయిరీని ఎందుకు తొక్కిపెడుతున్నారని బీజేపీ ఎమ్మెల్యేల్ని మంత్రి కోమటిరెడ్డి ప్రశ్నించారు. కాళేశ్వరం విషయంలో విచారణను ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా ఎందుకు ఆపుతున్నారో బీజేపీ నేతలు సమాధానం చెప్పాలన్నారు.

దీనిపై మంత్రి శ్రీధర్ బాబు స్పందిస్తూ 22ఏపై స్వల్ప కాలిక చర్చ పెట్టాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోందని, 22 ఏ అంశంపై చర్చకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. బీజేపీ సభ్యులు కూర్చోవాలన్న స్పీకర్?, సభ సజావుగా సాగేందుకు సహకరించాలని ఆ పార్టీ సభ్యులను కోరారు.

బీఏసీలో నిర్ణయం తీసుకుని 22ఏపై చర్చిద్దామని తెలిపారు.బీఏసీ సమావేశంలో 22 ఏ అంశాన్ని మొదటి ప్రాధాన్యతగా తీసుకుంటామని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. 22 ఏపై స్వల్ప కాలిక చర్చకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమని హామీ ఇచ్చారు.

నియమ నిబంధనలకు అనుగణంగా బీఏసీ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని బీజేపీ ఎమ్మెల్యేలకు చెప్పారు. ప్రతిపక్షాలు చర్చకు సహకరించాలని కోరారు. మంత్రి శ్రీధర్ బాబు, స్పీకర్ సర్దిచెప్పినా బీజేపీ ఎమ్మెల్యేలు వినకుండా 22ఏపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని నినాదాలు చేశారు. రాజకీయాల కోసం సభను అడ్డుకోవడం సరైంది కాదని శ్రీధర్ బాబు విమర్శించారు. సభ సజావుగా సాగేందుకు సహకరించాలని బీజేపీ ఎమ్మెల్యేలను కోరారు. అయితే శ్రీధర్ బాబు విజ్ఞప్తిని బీజేపీ సభ్యలు పట్టించుకోలేదు.

పదేపదే ఆయన కోరినా 22ఏ పై తక్షణమే చర్చ జరిగాలని పట్టుపట్టారు. దీంతో సభలో గందరగోళం చెలరేగింది. ఓ దశలో స్పీకర్ సభను వాయిదా వేశారు. సభ తిరిగి ప్రారంభమైన తరువాత కూడా బీజేపీ సభ్యులు తమ ఆందోళనను కొనసాగించారు. వచ్చే బోనాల పండుగ నాటికి ఇందిరమ్మ ఇళ్లు పూర్తి చేస్తామని శాసన మండలిలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపునకు నియోజకవర్గాన్ని యూనిట్?గా తీసుకున్నట్లుగా వివరించారు. లబ్ధిదారులకు మార్కెట్ ధర కంటే తక్కువ రేటుకే సిమెంట్ ఇప్పిస్తామని చెప్పారు.పేదలు నివసించే ప్రాంతంలోనే ఇందిరమ్మ ఇళ్లను కట్టించి ఇస్తామని పొంగులేటి వెల్లడించారు. 2023 ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ ప్రభుత్వం హడావిడిగా కొంతమందికి పట్టాలిచ్చిందన్నారు. వారు ఇచ్చిన ఇళ్లలో చాలా మంది నివసించట్లేదని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో పేదలు నివసించే ప్రాంతానికి 30-40 కిలోమీటర్ల దూరంలో ఇళ్లు ఇచ్చారని, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో నివసించే వారిని అంటరాని వారిగా చూసేవారని ఆయన తెలిపారు.

# యూపీలో ఘోర రోడ్డు ప్రమాదం..

**ప్రయాణికులతో వెళుతున్న వాహనం బోల్తా**

**12 మంది మృతి, పదుల సంఖ్యలో గాయాలు**

**బాఘ్‌పత్,సెప్టెంబర్ 7(పిసిడబ్ల్యూ న్యూస్):** ఉత్తరప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. బాఘ్‌పత్ జిల్లాలో సోమవారం తెల్లవారుజామున ప్రయాణి కుల తో వెళుతున్న ఓ పికప్ వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో 12 మంది అక్కడికక్కడే మృతి చెందగా, పలువురు ప్రయాణికులు తీవ్రంగా గాయ పడ్డారు. రాజస్థాన్ నుంచి 32 మంది ప్రయాణికులతో బదౌన్‌కు బయలుదేరిన పికప్ వాహనం,. సోమవారం అర్ధరాత్రి దాదాపు 12:30 గంటల సమయంలో ఖేక్డా పోలీస్ స్టేషన్ పరిధిలోకి



రాగానే ప్రమాదానికి గురైంది. వాహనం ఒక్కసారిగా అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను బలంగా ఢీకొట్టడంతో బోల్తా పడింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఖేక్డా, బాఘ్‌పత్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, జిల్లా ఆసుపత్రికి తరలించారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఉన్నత స్థాయి ఆసుపత్రులకు తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో ప్రయాణికులంతా గాఢ నిద్రలో ఉన్నారని, ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో మేల్కొనేలోపే వాహనం బోల్తా పడిందని క్షతగాత్రులు తెలిపారు. అయితే, వెనుక నుంచి మరో వాహనం ఢీకొట్టడం వల్లే ఈ ప్రమాదం సంభవించిందని డ్రైవర్ పేర్కొంటున్నాడు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగి స్తున్నారు. మృతుల వివరాలను సేకరిస్తున్నామని, బాధితుల కుటుంబ సభ్యుల సమాచారం కోసం 9454417383 నంబర్‌లో సంప్రదించాలని బాఘ్‌పత్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు ఒకే నిబంధన

(మొదటి పేజీ తరువాయి)

వెంటనే అమలు చేయాలని ప్రభుత్వ రంగ చమురు సంస్థలను కేంద్రం ఆదేశించింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీఎల్), భారత్ పెట్రోలియం (బీపీసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియం (హెచ్‌పీసీఎల్) ఈ నిబంధనను అమలు చేయనున్నాయి. రీఫిల్ బుకింగ్‌లో పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య ఉన్న తేడా ఇక ఉండదు. కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు, పర్యాటక శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపీ సోమవారం ఈ విషయాన్ని వెల్లడించారు. ఎల్‌పీజీ సరఫరా పరిస్థితి మెరుగుపడిందని తెలిపారు. రీఫిల్ బకాయిలు కూడా గణనీయంగా తగ్గాయని చెప్పారు. దీంతో 45 రోజుల నిబంధనను సడలించినట్లు పేర్కొన్నారు. పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల కారణంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎల్‌పీజీ సరఫరాపై ఒత్తిడి పెరిగింది. దీంతో డిమాండ్‌ను నియంత్రించేందుకు పట్టణ ప్రాంతాల్లో 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల వ్యవధిని కేంద్రం తీసుకొచ్చింది. ఇప్పుడు పరిస్థితి మెరుగుపడటంతో ఆ పరిమితిని తొలగించింది.

# అసెంబ్లీకి వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దు

**హైదరాబాద్ సెప్టెంబర్ 7(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ అసెంబ్లీ వద్ద సోమవారం ఉదయం జరిగిన ఉద్రిక్తతల పై రాష్ట్ర హోం శాఖకు తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. అసెంబ్లీకి వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దని పోలీసులను ఆదేశించింది. ఎమ్మెల్యేలపై పోలీసులు చర్యలు తీసుకో వద్దని, నిబంధనలు ఉల్లంఘిస్తే స్పీకర్ చర్యలు తీసుకుంటారని స్పష్టం చేసింది. మహిళా ఎమ్మెల్యే లపై దాడి చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసులను గుర్తించాలని, ఈ ఘటనపై విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోర్టు ఆదేశించింది. ఈ అంశంలో డిజిపి నివేదిక ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

# తాతా మధును బీఆర్ఎస్ డిస్మిస్ చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

చూడలేకపోతున్నారని సీఎం అన్నారు. బీఆర్ఎస్ దళిత వ్యతిరేక ఆలోచనను సరిదిద్దకపోతే భవిష్యత్ తరాలు ఈ సభను క్షమించవన్నారు. ఈ రకమైన అవమానం ఎప్పుడూ, ఎక్కడా జరగలేదని వ్యాఖ్యానించారు. ఈ అంశానికి సంబంధించి కేసీఆర్ తక్షణమే క్షమాపణ చెప్పాలని సీఎం డిమాండ్ చేశారు. స్పీకర్ చైర్‌ను అభ్యంతరకర భాష మాట్లాడిన ఎమ్మెల్సీ తాతా మధును బీఆర్ఎస్ డిస్మిస్ చేయాలన్నారు. తాతా మధుతో రాజీనామా చేయించాలని.. లేకపోతే బర్తరఫ్ చేయాలన్నారు. తాము ఏం మాట్లాడినా వెనుక కేసీఆర్ ఉన్నారని బీఆర్ఎస్ నేతలు ఇష్టానుసారం మాట్లాడుతున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

# మరోసారి సర్ గడువు పొడిగింపు

(మొదటి పేజీ తరువాయి)

పొడిగించినట్లు తెలిపింది. క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ అనంతరం వాటి పరిశీలన, పరిష్కార ప్రక్రియ కొనసాగనుంది. ఈ ప్రక్రియను నవంబర్ 5లోగా పూర్తి చేయాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కారం పూర్తైన తర్వాత నవంబర్ 9న తెలంగాణలో తుది ఓటర్ల జాబితాను ప్రకటించనున్నారు.

## ఆరావళి కొండల నిర్వచనం.. హైపవర్ కమిటీ గడువు పొడిగింపు

(మొదటి పేజీ తరువాయి)

గడువు ఇచ్చింది. ఫిబ్రవరి 2027 వరకు గడువు పొడిగించాలన్న కమిటీ అభ్యర్థనను సుప్రీంకోర్టు తిరస్కరించింది. అవసరమైతే కమిటీ "పగలు రాత్రి" పనిచేయాలని భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్‌లు జయమల్య బాగ్చీ, వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. ఇకపై ఎలాంటి పొడిగింపు ఇవ్వబోమని స్పష్టం చేసింది. రాజస్థాన్, గుజరాత్‌లోని గిరిజన వర్గాలతో సహా సంబంధిత వర్గాలన్నింటి వాదనలు వినాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ, ఈ ప్రక్రియను పూర్తి చేయడానికి హెచ్‌పీసీ మరో ఆరు నెలల సమయం కోరింది. ఈ విషయంపై తదుపరి విచారణ డిసెంబర్ 2న జరగనుంది.

# రాష్ట్రాన్ని పెట్టుబడుల గమ్యస్థానంగా మారుస్తాం

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించి చర్చించారు. గ్లోబల్ సమ్మిట్‌కు దేశ, విదేశాల నుంచి ప్రముఖులు, అంతర్జాతీయ పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాల ప్రతినిధులు, సీఈఓలు, సీఎక్స్‌ఓలు, దౌత్యవేత్తలు తదితరులను పెద్ద సంఖ్యలో ఆహ్వానించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమ్మిట్‌కు హాజరుకావాల్సిందిగా ప్రముఖులకు ఈ-మెయిల్స్ ద్వారా అధికారిక ఆహ్వానాలు పంపే ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని సూచించారు.సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ఆహ్వానితుల జాబితాను సిద్ధం చేసి, ఆహ్వానాల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. తెలంగాణలోని ఫ్యూచర్ సిటీ, ఐటీ, ఏఐ, ఫార్మాస్యూటికల్స్, డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, క్లీన్ ఎనర్జీ, అధునాతన తయారీ రంగాలు, మౌలిక వసతులు, ఆవిష్కరణలు తదితర రంగాల్లో ఉన్న అవకాశాలను సమ్మిట్ ద్వారా ప్రపంచ పెట్టుబడిదారులకు సమర్థవంతంగా ప్రదర్శించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. గ్లోబల్ సమ్మిట్‌ను ప్రతిష్టాత్మకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో సమయపాలనతో కూడిన కార్యాచరణను అమలు చేయాలని సీఎస్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీనియర్ అధికారులు కృష్ణ ఆదిత్య, అజిత్ రెడ్డి, అనుదీప్ దురిశెట్టి, నిఖిల్ చక్రవర్తి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నట్టు సమాచార పౌర సంబంధాల శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

# ఎలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయలేదు: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు



**హైదరాబాద్:సెప్టెంబర్ 7(పిసిడబ్ల్యూ న్యూస్):** శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిలను ఉద్దేశించి తాను ఎలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయలేదని, స్పీకర్ స్థానమంటే తనకు అపారమైన గౌరవం ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు స్పష్టం చేశారు.పోలీసుల అక్రమాలను ప్రశ్నిస్తే.. దాన్ని స్పీకర్‌ను అవమానించినట్లు చిత్రీకరిస్తూ కాంగ్రెస్ నేతలు శవరాజకీయాలు చేస్తున్నారు. కాంగ్రెస్ నేతల డిమాండ్లకు భయపడేది లేదు" అని తేల్చిచెప్పారు. అసెంబ్లీ గేటు వద్ద బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల, ప్రజాప్రతినిధుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ, తన ప్యాంటు లాగి గొంతు నొక్కేందుకు యత్నించిన పోలీసు అధికారులపై మాత్రమే తాను ఆగ్రహం వ్యక్తం చేశానని, తీవ్ర అసహనంతో అన్న మాటలను స్పీకర్‌కు ఆపాదిస్తూ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఉపసర్పంచుల చెక్ పవర్ రద్దు చేస్తే మరో ఉద్యమమే

**- గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న ఉపసర్పంచులను ప్రభుత్వం చిన్నచూపు చూడటం తగదు**

**- చెక్ పవర్ రద్దు చేస్తే తీవ్ర పరిణామాలు తప్పవు**

**- హక్కుల కోసం ప్రతి ఉపసర్పంచ్ ఉద్యమానికి సిద్ధం కావాలి**

**- అమరణ నిరాహార దీక్షకైనా వెనుకాడం**

**- ఉపసర్పంచ్ ఫోరం ములుగు జిల్లా అధ్యక్షుడు అంకం సురేష్ ముదిరాజ్**



**మల్లంపల్లి మండల ప్రతినిధి, సెప్టెంబర్ 7(పిసిడబ్ల్యూ న్యూస్):** గ్రామాల అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారంలో కీలకంగా పనిచేస్తున్న ఉపసర్పంచులను ప్రభుత్వం చిన్నచూపు చూడటం సరికాదని ఉపసర్పంచుల ఫోరం ములుగు జిల్లా అధ్యక్షుడు అంకం సురేష్ ముదిరాజ్ అన్నారు. ఉపసర్పంచులకు ఉన్న చెక్ పవర్‌ను రద్దు చేసే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. చెక్ పవర్‌ను రద్దు చేస్తే రాష్ట్రవ్యాప్తంగా మరో ఉద్యమం తప్పదని హెచ్చరించారు. గ్రామపంచాయతీల పాలనలో సర్పంచులతో పాటు ఉపసర్పంచులు కూడా కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారని సురేష్ ముదిరాజ్ పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, తాగునీరు, అంతర్గత రహదారులు, వీధి దీపాలు, అభివృద్ధి పనులు తదితర అంశాల్లో ఉపసర్పంచులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ తమ వంతు బాధ్యతను నిర్వర్తిస్తున్నారని తెలిపారు. అలాంటి ఉపసర్పంచుల అధికారాలను తగ్గించడం లేదా వారికి ఉన్న చెక్ పవర్‌ను రద్దు చేయడం వల్ల గ్రామపంచాయతీల పాలనలో సమన్వయం దెబ్బతినే అవకాశం ఉందన్నారు. ఉపసర్పంచులకు రాజ్యాంగబద్ధంగా, చట్టబద్ధంగా ఉన్న హక్కులు, అధికారాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. **హక్కులను హరించే ప్రయత్నాలను సహించం** ఉపసర్పంచుల హక్కులను హరించే విధంగా ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకున్నా సహించేది లేదని సురేష్ ముదిరాజ్ హెచ్చరించారు. రాష్ట్రంలోని ప్రతి ఉపసర్పంచ్ తమ హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. అవసరమైతే మండల, జిల్లా స్థాయిల్లో ఆందోళనలు చేపట్టి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని అన్నారు. ఉపసర్పంచుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించడంతో పాటు, వారి అధికారాలు, విధులు, బాధ్యతలపై స్పష్టత ఇవ్వాలని కోరారు. గ్రామాల అభివృద్ధిలో ఉపసర్పంచుల పాత్రను గుర్తించి వారికి మరింత ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. **అమరణ నిరాహార దీక్షకైనా సిద్ధం** చెక్ పవర్ రద్దు నిర్ణయం తీసుకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని అంకం సురేష్ ముదిరాజ్ స్పష్టం చేశారు. ఉపసర్పంచుల హక్కుల కోసం అవసరమైతే అమరణ నిరాహార దీక్ష చేయడానికైనా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ప్రభుత్వం తమ హెచ్చరికను తీవ్రంగా పరిగణించి ఉపసర్పంచుల చెక్ పవర్ రద్దు ఆలోచనను విరమించుకోవాలని కోరారు. గ్రామపంచాయతీల్లో ప్రజాస్వామ్యబద్ధమైన పాలన కొనసాగాలంటే సర్పంచులు, ఉపసర్పంచులు సమన్వయంతో పనిచేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఉపసర్పంచులను బలహీనపరిచే నిర్ణయాల వల్ల గ్రామీణ ప్రాంతాల్లో పరిపాలనపై ప్రభావం పడే అవకాశం ఉందని తెలిపారు. **"ఉపసర్పంచుల ఐక్యతను ఎవరూ అడ్డుకోలేరు"** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉపసర్పంచులందరూ ఐక్యంగా ఉండాలని, హక్కుల పరిరక్షణ కోసం కలిసికట్టుగా పోరాడాలని సురేష్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉప సర్పంచుల సమస్యలపై చర్చించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని హెచ్చరించారు.

## మట్టి గణేష్ విగ్రహాల పోస్టర్లను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



**ములుగు జిల్లా సెప్టెంబర్07(పిసిడబ్ల్యూ న్యూస్):** వినాయక చవితి సందర్భంగా వినాయక విగ్రహాల తయారీలో కృత్రిమ రంగులు, రసాయనాల వినియోగం వల్ల జల వనరులు కాలుష్యానికి గురవుచున్నాయని, అందుచే కృత్రిమ రంగులు, రసాయనాలతో చేసిన విగ్రహాలను మానివేసి మట్టితో చేసిన విగ్రహాలను పూజించి చెరువులను కలుషితం కాకుండా కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని తన ఛాంబర్లో వినాయక చవితి పండుగను పురస్కరించుకొని ఈ సంవత్సరం, పర్యావరణం పై అవగహన కల్పించేందుకు, మట్టి గణేష్ విగ్రహాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణానికి అనుకూలమైన మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకోని పర్యావరణాని కాపాడుకునే బాధ్యత మన అందరిపై ఉందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాలలో భాగంగా 8 అంగుళాల మట్టి గణపతి లను అందించి పర్యావరణంపై అహగహన కార్యక్రమాలను తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి వారిచే నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. చెరువుల్లో మట్టి మేటలను తొలిగించటానికి చెరువులో స్వచ్ఛత కాపాడటానికి వినాయక చవితి సందర్భంగా ప్రజలు భక్తులు నడుము బిగించాలని మట్టి తో వినాయక విగ్రహాలు తాయారు చేసి భక్తితో చెరువులోకి చేర్చొచ్చని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోరారు. మట్టి విగ్రహాలను పూజించి చెరువులను కలుషితం కాకుండా కాపాడుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఏ ఈ ఎస్, టి జి పి సి బి నోడల్ ఆఫీసర్ ములుగు అరుణ దేవి, డి పి ఆర్ ఓ రఫిక్, తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించాలి

**శాంతిభద్రతలు, ప్రజల సౌకర్యాలకు ప్రాధాన్యం ఇవ్వాలి**

**జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**




**ములుగు జిల్లా సెప్టెంబర్ 07( పి సి డబ్ల్యూ న్యూస్):** వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని సమావేశ మందిరంలో వినాయక చవితి ఉత్సవాల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వినాయక మండపాల నిర్వాహకులు పోలీస్ శాఖ వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలను నమోదు చేసి అనుమతి పొందాలని సూచించారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోలేని వారు సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనుమతులు పొందిన తర్వాతే మండపాలను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. మండపాల వద్ద జూదం, అభ్యంతరకర ప్రసంగాలు, అవాంఛనీయ కార్యకలాపాలకు తావివ్వకుండా భక్తి కార్యక్రమాలు మాత్రమే నిర్వహించాలని తెలిపారు. మసీదులు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు తదితర ప్రాంతాల సమీపంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రార్థనా సమయాల్లో మసీదుల సమీపంలోని మండపాల నిర్వాహకులు పూర్తి సహకారం అందించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించాలని కలెక్టర్ సూచించారు. డీజేలకు అనుమతి లేదని, మండపాల వద్ద భక్తిగీతాలను మాత్రమే వినిపించాలని స్పష్టం చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు పోలీస్ శాఖతో సమన్వయం చేసుకొని శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మండపాల వద్ద విద్యుత్ తీగలు, స్విచ్ బోర్డులు, దీపాలను సురక్షితంగా ఏర్పాటు చేయాలని, విద్యుత్ కనెక్షన్ల కోసం ముందుగానే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రమాదాలకు తావులేకుండా నాణ్యమైన విద్యుత్ పరికరాలను వినియోగించాలని తెలిపారు. పురపాలక, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ, వీధి దీపాలు, తాగునీరు తదితర ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అత్యవసర వైద్య సేవలు, అంబులెన్సులు, అగ్నిమాపక వాహనాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. మండల స్థాయిలో తహసీల్దార్లు పంచాయతీ కార్యదర్శులు, గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశాలు నిర్వహించి అవసరమైన ఏర్పాట్లపై కార్యాచరణ రూపొందించాలన్నారు. అన్ని శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి వినాయక చవితి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ఆర్డీవో కృష్ణవేణి, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును బాధ్యతగా పరిష్కరించాలి

**- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**



**ములుగు జిల్లా సెప్టెంబర్07(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును అధికారులు బాధ్యతతో పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి నేరుగా దరఖాస్తులను స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను అడిగి తెలుసుకొని, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజావాణి కార్యక్రమంలో భూ సమస్యలు 9, ఇందిరమ్మ ఇండ్లు 1, పింఛన్లు 1, ఉద్యోగాలు 15, ఇతర శాఖలకు సంబంధించినవి 10 కలిపి మొత్తం 36 దరఖాస్తులు అందాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ, ప్రజావాణి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులో పరిష్కరించాలని సూచించారు. పరిష్కారానికి అవకాశం ఉన్న సమస్యలపై జాప్యం చేయకుండా చర్యలు తీసుకోవాలని, దరఖాస్తుల పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు అర్జీదారులకు తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ఆర్డీఓ కృష్ణవేణి, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ఎస్ఐఆర్ సమీక్ష సమావేశం

**సమావేశంలో పాల్గొన్న టీడీపీ తెలుగు మహిళ అధికార ప్రతినిధి చుండూరు రాజరాజేశ్వరి**

**అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచన**





**ఖమ్మం:సెప్టెంబర్ 07( పి సి డబ్ల్యూ న్యూస్):** ఓటర్ల జాబితా సవరణలో భాగంగా చేపడుతున్న ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎలక్ట్రోరల్ అబ్జర్వర్ శ్రీ దేవసేన, జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో తెలుగుదేశం పార్టీ తెలుగు మహిళ అధికార ప్రతినిధి చుండూరు రాజరాజేశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియ అమలు, ఓటర్ల జాబితాలో పేర్ల నమోదు, తొలగింపులు, తప్పుల సవరణ, చిరునామాల మార్పులు తదితర అంశాలపై అధికారులు వివరాలను వెల్లడించారు. క్షేత్రస్థాయిలో బీఎల్ఓలు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే, ప్రజల నుంచి స్వీకరిస్తున్న దరఖాస్తులు, అభ్యంతరాల పరిష్కారం వంటి అంశాలపై సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా రాజరాజేశ్వరి మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి పౌరుడి ఓటు హక్కు పరిరక్షణ అత్యంత ముఖ్యమని, ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి అర్హుడి పేరు అన్యాయంగా తొలగిపోకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అదే సమయంలో మరణించిన వారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు, డూప్లికేట్ ఓటర్లు వంటి వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి జాబితాను పారదర్శకంగా రూపొందించాలని సూచించారు. ప్రజలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి, తమ ఓటు వివరాల్లో ఏవైనా తప్పులు ఉంటే సంబంధిత అధికారులను సంప్రదించి సరిచేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు పునాది అని, ప్రతి అర్హుడి ఓటు హక్కును కాపాడటంలో రాజకీయ పార్టీలు, అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని చుండూరు రాజరాజేశ్వరి పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీఓ శ్రీనివాస్, కలెక్టరేట్ ఎలక్షన్ విభాగం పర్యవేక్షకులు రాజు, డీటీ అన్సారీ, బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి బెల్లం వేణుగోపాల్, ఐఎన్ సి పార్టీ ప్రతినిధి అన్నెం గోపాల్ రావు, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి స్వర్ణ సుబ్బారావు, సీపీఐ(ఎం) పార్టీ ప్రతినిధి ఆర్. ప్రకాష్, బిజెపి పార్టీ ప్రతినిధి వి. రాజేష్, బీఆర్ఎస్ వి ప్రతినిధి ఎల్. సతీష్ బాబు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ములుగు జిల్లా ఏటూరునాగారం ఐటీడీఏ ఎదుట విద్యార్థుల నిరసన ధర్నా..

**• బాలికల గురుకుల పాఠశాలలో నీటి సౌకర్యం లేక ఇబంది పడుతున్న విద్యార్థులు..**



**ములుగు జిల్లా వాజేడు సెప్టెంబర్07( పి సి డబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా వాజేడు మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలలో మరుగుదోడ్లు, తాగునీటి బోరు, పాఠశాల భవనం సరిగా లేకపోవడంతో ఐటీడీఏ అధికారులకు గురుకులం అధ్యాపకులు తెలపగా అట్టి గురుకులంలోని విద్యార్థులను ఐటీడీఏ ఎదుట నూతనంగా నిర్మించబడినా భవనానికి సుమారు వంద మంది విద్యార్థులను తరలించారు. ఐతే ఇక్కడ కూడా అదే పరిస్థితి నెలకొనడంతో విద్యార్థులు రోజువారి కాలకృత్యాలు తీసుకోవడానికి స్నానాలు చెయ్యడానికి నీటి సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు అంతే కాకుండా దీంతో ఉపాధ్యాయులు తక్కువగా ఉన్నారు ఆదివాసీ సంఘాల నాయకుల మద్దతుతో తమకు సౌకర్యాలు కల్పించాలని ఐటీడీఏ ఎదుట బైటాయించి నిరసన ధర్నా చేపట్టారు.

# బండారుపల్లిలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

**- జిల్లా కలెక్టర్‌కి 11వ వార్డు కౌన్సిలర్ నవీన్ కేశెట్టి వినతి**



**ములుగు జిల్లా ములుగు మున్సిపాలిటీ సెప్టెంబర్07( పి సి డబ్ల్యూ న్యూస్ ):** ములుగు మున్సిపాలిటీ పరిధిలోని బండారుపల్లి గ్రామంలో ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని పాఠశాల సమీపంలో, ప్రధాన కూడళ్ల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరుతూ 11వ వార్డు కౌన్సిలర్ నవీన్ కేశెట్టి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.బండారుపల్లి గ్రామంలో పాఠశాల సమీపంలోని ప్రధాన కూడళ్ల వద్ద వాహనాల రాకపోకలు అధికంగా ఉంటున్నాయని, ముఖ్యంగా పాఠశాల సమయాల్లో విద్యార్థులు రోడ్డు దాటే సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని కౌన్సిలర్ తెలిపారు. వాహనదారులు వేగంగా ప్రయాణించకుండా నియంత్రించేందుకు ఆయా ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు.ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ, బండారుపల్లి గ్రామంలోని పాఠశాల సమీపంలో, అవసరమైన ప్రధాన కూడళ్ల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని, సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి వీలైనంత త్వరగా పనులు చేపట్టాలని కలెక్టర్‌ను కోరారు.స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తే విద్యార్థులు, పాదచారులు, గ్రామ ప్రజలకు రహదారి భద్రత మెరుగుపడి ప్రమాదాల నివారణకు దోహదపడుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. కౌన్సిలర్ చేసిన ఈ వినతిపై అధికారులు సానుకూలంగా స్పందించి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ఎస్ఐఆర్‌లో అనామలీస్,నో మ్యాపింగ్ ఓటర్లకు నోటీసులు అందించి పకడ్బందీగా విచారణ చేపట్టాలి

**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి.**

**ప్రతి ఓటరుకు నోటీసు**

**అందేలా చర్యలు తీసుకోవాలి.**

**విచారణ ప్రక్రియను పారదర్శకంగా,**

**నిబంధనల ప్రకారం నిర్వహించాలి.**

**జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి.**




**ములుగు జిల్లా సెప్టెంబర్07(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో అనామలీస్, నో మ్యాపింగ్ కేటగిరీలో గుర్తించిన ప్రతి ఓటరుకు నోటీసులు అందించి, వారితో పకడ్బందీగా విచారణ నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు.సోమవారం హైదరాబాద్ నుంచి ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనామలీస్, నో మ్యాపింగ్ ఓటర్లకు నోటీసుల జారీ, పంపిణీ, విచారణ ప్రక్రియపై జిల్లాల వారీగా సమీక్షించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి ములుగు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియో సమావేశ మందిరం నుంచి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ అనామలీస్, నో మ్యాపింగ్ కేటగిరీలో గుర్తించిన ప్రతి ఓటరుకు నోటీసులు పంపిణీ చేయాలని సూచించారు. నోటీసులు అందించిన అనంతరం సంబంధిత ఓటర్లకు విచారణకు పూర్తి అవకాశం కల్పించి, వారి వివరాలను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు.విచారణ ప్రక్రియలో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని, ప్రతి కేసుకు సంబంధించిన వివరాలను సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. నిర్ణీత గడువులోగా నోటీసుల పంపిణీ, విచారణ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతి పై జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ జిల్లాలో అసమానతలు ఉన్న, మ్యాపింగ్ కాని ఓటర్లకు సంబంధించి 41,900 నోటీసులు సిద్ధం చేయగా, ఇప్పటివరకు 24,394 నోటీసులను జారీ చేసి సంబంధిత వివరాలను యాప్‌లో నవీకరించినట్లు తెలిపారు.నోటీసులపై విచారణ ప్రక్రియను పూర్తి చేసి, పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. భారత ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ వీడియో సమావేశంలో ఎన్నికల నమోదు అధికారి, ఆర్డీఓ కృష్ణవేణి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఎండీ సలీం, ఎన్నికల విభాగం నాయబ్ తహసీల్దార్ ఎం. నితీష్,సంబధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను వెంటనే నెరవేర్చాలి

**6 గ్యారంటీలు, 420 హామీలపై శ్వేతపత్రం విడుదల చేయాలి: బీఆర్ఎస్**





**ఏటూరునాగారం సెప్టెంబర్ 07(పిసిడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ ఏటూరునాగారం మండల కమిటీ డిమాండ్ చేసింది. ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు ఆదేశాల మేరకు సోమవారం ఏటూరునాగారం మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక ఎంపీడీవో, తహసీల్దార్ అధికారులకు వివిధ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల కమిటీ అధ్యక్షుడు గడదాసు సునీల్ కుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయినా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలు, 13 డిక్లరేషన్లను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. ఇప్పటివరకు ప్రభుత్వం ఎన్ని హామీలు అమలు చేసిందో ప్రజలకు స్పష్టం చేస్తూ వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ప్రజలకు ఇచ్చిన హామీలను కాలయాపన చేయకుండా అమలు చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ తెలంగాణ ఉద్యమకారులు, మండల పార్టీ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, వివిధ గ్రామాల పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, మహిళా నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు

# వృద్ధులకు అండగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ

**చట్టాలపై అవగాహన కల్పించిన సీనియర్ సివిల్ జడ్జి కందుకూరి పూజ**





**హనుమకొండ ప్రతినిధి,సెప్టెంబర్07(పిసిడబ్ల్యూ న్యూస్):** వృద్ధుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ వరంగల్ ప్రత్యేక చర్యలు చేపట్టింది. సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కందుకూరి పూజ సోమవారం రంగశాయిపేటలోని ఎలగందుల అమృత స్మారక వృద్ధాశ్రమం, మమునూరులోని సాయి ఓల్డేజ్ హోంను సందర్శించి వృద్ధులతో మమేకమయ్యారు.వృద్ధుల ఆరోగ్య పరిస్థితులు, వ్యక్తిగత సమస్యలను స్వయంగా తెలుసుకున్న ఆమె, న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అందించే ఉచిత న్యాయ సహాయం, సంక్షేమ పథకాలు, చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా 'తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ మరియు సంక్షేమ చట్టం2007' లోని ముఖ్యాంశాలను వివరించారు. వృద్ధులు ఒంటరితనానికి లోనుకాకుండా పరస్పరం అనుభవాలు పంచుకుంటూ ఆనందంగా జీవించాలని సూచించారు. ఆరోగ్య పరిరక్షణలో సమతుల్య ఆహారం, పండ్లు, అవసరమైన ఔషధాలు కీలకమని తెలిపారు.ఆశ్రమ నిర్వాహకులు అందిస్తున్న సేవలను ప్రశంసించిన ఆమె, వృద్ధుల సంరక్షణలో మరింత బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. న్యాయపరమైన ఏ సమస్య వచ్చినా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించి ఉచిత న్యాయ సేవలు పొందవచ్చని తెలిపారు.ఈ సందర్భంగా సాయి వృద్ధాశ్రమంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించగా, ఎలగందుల అమృత స్మారక వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు లావణ్య, రాజేంద్ర ప్రసాద్‌తో పాటు ఆశ్రమంలోని వృద్ధులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి పోరుబాట



**కల్లూరు, సెప్టెంబరు 7 (పిసిడబ్ల్యూ న్యూస్) :** బీఆర్ఎస్ చేపట్టిన పోరుబాట కార్యక్రమంలో భాగంగా కల్లూరులో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పలు సమస్యలపై వినతిపత్రాలు సమర్పించారు. మాజీ జెడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎంపీడీవో చంద్రశేఖర్‌ను కలిసి కల్లూరు మున్సిపాలిటీతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.**మౌలిక వసతులు కల్పించాలి** కల్లూరు మున్సిపాలిటీ, మండల పరిధిలోని గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక వసతుల సమస్యలను పరిష్కరించాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కోరారు.**శాశ్వత పరిష్కారం చూపాలి** గ్రామాల్లో ప్రజలు ఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలకు తాత్కాలిక చర్యలతో కాకుండా శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. ప్రజావాణికి వచ్చే ప్రతి ఫిర్యాదును సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు సానుకూలంగా స్పందించి త్వరితగతిన పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా ఎంపీడీవో చంద్రశేఖర్‌కు పలు వినతిపత్రాలు అందజేశారు. ప్రజా సమస్యలను సంబంధిత శాఖల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మండల యూత్ అధ్యక్షులు పెడకంటి రామకృష్ణ, మహమ్మద్ ఇస్మాయిల్, సయ్యద్ ఇంతియాజ్, సొసైటీ చైర్మన్ నర్వనేని పెద్ద అంజయ్య, మాజీ జడ్పిటిసి మేకల కృష్ణ, మాజీ ఏఎంసి వైస్ చైర్మన్ కాటంనేని వెంకటేశ్వరరావు, సర్పంచ్లు గుగులోతు శ్రీను, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కొరకప్పు ప్రసాద్, రావుఫ్, వెంకటరత్నం, మోదుగు వీరయ్య, కృష్ణ, కమ్లి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వారాహి భక్తితో ఆధ్యాత్మిక చైతన్యానికి అనుపమ మాత విశేష కృషి

**వారాహి నవరాత్రులు, ధ్యానంపూజలుయజ్ఞాల**

**ద్వారా ప్రజల్లో ఆధ్యాత్మికతకు చేరువ**

**ఆలయాల అభివృద్ధి, గోసంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం**

**ఆర్.కె. కళా సాంస్కృతిక ఫౌండేషన్ గురు పూజలో ఘన సన్మానం**






**హైదరాబాద్ సెప్టెంబర్ 07 (పిసిడబ్ల్యూ న్యూస్):**అమ్మ వారాహి అనుగ్రహంతో గత కొన్ని సంవత్సరాలుగా వారాహి నవరాత్రులను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూ, ధ్యానం, పూజలు, యజ్ఞాల ద్వారా ప్రజలను ఆధ్యాత్మికతకు చేరువ చేస్తున్న దేవ పూజ్యులు అనుపమ మాత సేవలను గుర్తిస్తూ ఆర్.కె. కళా సాంస్కృతిక ఫౌండేషన్ ఘనంగా సన్మానించింది.ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణతో పాటు ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తూ, గోవుల సంరక్షణకు తనవంతు సేవలను అందిస్తూ అనుపమ మాత భిన్నమైన ఆధ్యాత్మిక మార్గంలో ముందుకు సాగుతున్నారు. భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించేలా ఆమె నిర్వహిస్తున్న కార్యక్రమాలకు మంచి స్పందన లభిస్తోంది.ఆర్.కె. కళా సాంస్కృతిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గురు పూజా కార్యక్రమంలో అనుపమ మాతను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె చేస్తున్న ఆధ్యాత్మిక, ధార్మిక సేవలను నిర్వాహకులు కొనియాడారు. సమాజంలో ఆధ్యాత్మిక విలువలు, సేవా భావన మరింత విస్తరించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు.

# ఎస్ఐఆర్‌లో అనామలీస్, నో మ్యాపింగ్ ఓటర్లకు నోటీసులు జారీ చేసి పారదర్శకంగా విచారణ చేపట్టాలి

**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి**

**- ప్రతి ఓటరుకు నోటీసు అందేలా చర్యలు తీసుకోవాలి**

**- విచారణ ప్రక్రియను పారదర్శకంగా,**

**నిబంధనల ప్రకారం నిర్వహించాలి**



**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 7(పిసి డబ్ల్యూ న్యూస్):** ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా Anomalies, No Mapping కేటగిరీల్లో గుర్తించిన ప్రతి ఓటరుకు నోటీసులు జారీ చేసి, నిబంధనల ప్రకారం సమగ్ర విచారణ చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాల వారీగా ాాలశీఖ్రీఅవం, చీశీ ఝిజూజూఅఅస్త్ర ఓటర్లకు నోటీసుల జారీ, నోటీసుల పంపిణీ, విచారణ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు.కరీంనగర్ నుంచి జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ, Anomalies, No Mapping కేటగిరీల్లో గుర్తించిన ప్రతి ఓటరుకు నోటీసు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నోటీసు అందుకున్న అనంతరం సంబంధిత ఓటరుకు విచారణలో తమ వాదనను వినిపించేందుకు పూర్తి అవకాశం కల్పించాలని, వారి వివరాలను నిబంధనల ప్రకారం సమగ్రంగా పరిశీలించాలని ఆదేశించారు.విచారణ సందర్భంగా ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా మొత్తం ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని సి. సుదర్శన్ రెడ్డి సూచించారు. ప్రతి కేసుకు సంబంధించిన వివరాలను క్రమబద్ధంగా నమోదు చేయడంతో పాటు, నిర్ణీత గడువులోగా నోటీసుల పంపిణీ, విచారణ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా కరీంనగర్ జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. ఇప్పటికే నోటీసులు అందుకున్న ఓటర్లకు సంబంధించిన విచారణ ప్రక్రియ కొనసాగుతోందని, నిర్ణీత గడువులోగా విచారణలను పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

# పంచాయతీ కార్యదర్శి సేవా కాలంపై రికార్డుల మిస్టరీ


## ఒకే ఉద్యోగి.. రెండు రకాల అధికారిక వివరాలు!

## సేవా కాలం తేల్చే అసలు రికార్డులు ఎక్కడ?

## 'రికార్డులు అందుబాటులో లేవు' అనే సమాధానంతో మరిన్ని సందేహాలు

## ఆర్టీఐ సమాచారంలో వ్యత్యాసం.. ఉన్నతాధికారుల విచారణకు డిమాండ్

**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 6(పిసిడబ్ల్యూ న్యూస్):** గ్రామపంచాయతీగా ఉన్న సమయంలో పనిచేసిన ఓ పంచాయతీ కార్యదర్శి సేవా కాలానికి సంబంధించిన రికార్డుల వ్యవహారం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఒకే ఉద్యోగికి సంబంధించిన సేవా కాలంపై ఒక అధికారిక లేఖలో ఒక విధమైన తేదీలు పేర్కొనగా, సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) ద్వారా అందిన సమాచారంలో భిన్నమైన వివరాలు ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో అసలు రికార్డులు ఏం చెబుతున్నాయి? అధికారికంగా పేర్కొన్న వివరాలకు ఆధారం ఏమిటి? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. **ఒకే ఉద్యోగి.. రెండు రకాల సేవా వివరాలేంటి?** సదరు పంచాయతీ కార్యదర్శి 29-04-2016 నుంచి 30-09-2018 వరకు విధులు నిర్వహించినట్లు ఒక అధికారిక లేఖలో పేర్కొన్నట్లు సమాచారం. అయితే ఇదే ఉద్యోగికి సంబంధించిన సేవా కాలంపై ఆర్టీఐ ద్వారా అందిన సమాచారంలో వేరే వివరాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఒకే ఉద్యోగి, ఒకే శాఖ, ఒకే సేవా కాలానికి సంబంధించి రెండు రకాల అధికారిక సమాచారం బయటకు రావడం ఇప్పుడు అనేక అనుమానాలకు కారణమవుతోంది. ఈ రెండు వివరాల్లో ఏది వాస్తవం? ఏ తేదీలను ఏ రికార్డు ఆధారంగా నిర్ధారించారు? అధికారిక లేఖ తయారు చేసే సమయంలో ఏ పత్రాలను పరిశీలించారు? ఆర్టీఐ దరఖాస్తుకు సమాధానం ఇచ్చేటప్పుడు ఏ రికార్డులను ఆధారంగా తీసుకున్నారు? అనే ప్రశ్నలకు అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. **అసలు రికార్డులు అడిగితే.. 'అందుబాటులో లేవు'!** సేవా కాలంపై ఏర్పడిన సందేహాలను నివృత్తి చేయాలంటే ఉద్యోగి విధుల్లో చేరిన తేదీ, బదిలీ అయిన తేదీ, రిలీవ్ అయిన తేదీకి సంబంధించిన అసలు పత్రాలను పరిశీలించడం అత్యంత కీలకం. ఈ నేపథ్యంలో జాయినింగ్ రిపోర్ట్, రిలీవింగ్ ఆర్డర్, బదిలీ ఉత్తర్వులు, పోస్టింగ్ ఉత్తర్వులు, సర్వీస్ రికార్డులు, సంబంధిత కార్యాలయ ఉత్తర్వులు వంటి పత్రాలే వాస్తవాలను నిర్ధారించగలవు. అయితే ఈ కీలక రికార్డులు కార్యాలయంలో ప్రస్తుతం అందుబాటులో లేవని సమాధానం వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో అసలు సేవా కాలాన్ని ఏ ఆధారంగా నిర్ధారించారు? అధికారిక లేఖలో తేదీలను ఎవరు, ఏ రికార్డు ఆధారంగా పేర్కొన్నారు? ఆర్టీఐ సమాచారాన్ని సిద్ధం చేసే సమయంలో ఏ పత్రాలను పరిశీలించారు? రికార్డులు లేకపోతే రెండు వేర్వేరు వివరాలు ఎలా వెలువడ్డాయి? అనే ప్రశ్నలు మరింత బలంగా వినిపిస్తున్నాయి. **మున్సిపాలిటీగా మారిన తర్వాత నాటి రికార్డులు ఎక్కడ?** ములుగు గ్రామపంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మారిన నేపథ్యంలో నాటి గ్రామపంచాయతీకి సంబంధించిన పాత రికార్డుల పరిరక్షణ అంశం కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. గ్రామపంచాయతీకి సంబంధించిన పాత పరిపాలనా, ఉద్యోగ, సర్వీస్ రికార్డులు ఏ కార్యాలయానికి బదిలీ అయ్యాయి? వాటిని ఎవరు స్వీకరించారు? రికార్డుల హ్యాండోవర్ సమయంలో రికార్డుల జాబితా రూపొందించారా? రూపొందించి ఉంటే ఆ జాబితా ప్రస్తుతం ఎక్కడ ఉంది? నాటి రికార్డులను ఏ అధికారి లేదా కార్యాలయం సంరక్షిస్తోంది? అనే అంశాలను అధికారులు వెల్లడించాల్సిన అవసరం ఉంది. ఒకవేళ రికార్డులు మున్సిపాలిటీకి లేదా ఇతర సంబంధిత కార్యాలయానికి బదిలీ చేసి ఉంటే.. వాటి స్వీకరణకు సంబంధించిన ఆధారాలు బయటపెట్టాల్సిన అవసరం ఉంది. రికార్డులు బదిలీ కాలేదంటే అవి ప్రస్తుతం ఎక్కడ ఉన్నాయన్నదానిపైనా స్పష్టత రావాల్సి ఉంది. **రికార్డులు లేకపోతే.. సేవా కాలం ఎలా నిర్ధారించారు?** ప్రభుత్వ ఉద్యోగి సేవా వివరాలు పరిపాలనా వ్యవస్థలో అత్యంత కీలకమైన అంశాలు. ఉద్యోగి ఏ తేదీన విధుల్లో చేరారు? ఎప్పుడు బదిలీ అయ్యారు? ఏ తేదీన రిలీవ్ అయ్యారు? ఏ హోదాలో ఎక్కడ పనిచేశారు? వంటి వివరాలకు సంబంధించి సాధారణంగా అధికారిక రికార్డులు ఉండాల్సి ఉంటుంది. అలాంటి రికార్డులు ప్రస్తుతం అందుబాటులో లేవని చెబుతున్న నేపథ్యంలో.. అధికారికంగా పేర్కొన్న సేవా కాలానికి ప్రామాణిక ఆధారం ఏమిటన్నది తేలాల్సి ఉంది. ఒక రికార్డు ఆధారంగా సేవా కాలాన్ని నిర్ధారించారా? లేక ఇతర కార్యాలయాల నుంచి వచ్చిన సమాచారాన్ని ఆధారంగా తీసుకున్నారా? అన్నది కూడా అధికారులు వెల్లడించాల్సిన అంశంగా మారింది.




**రికార్డులు గల్లంతయ్యాయా? బదిలీ అయ్యాయా?** కీలకమైన సర్వీస్ రికార్డులు నిజంగానే లభ్యం కాకపోతే అవి ఎప్పుడు అందుబాటులో లేకుండా పోయాయి? రికార్డుల సంరక్షణ బాధ్యత ఎవరిది? వాటిని మరో కార్యాలయానికి బదిలీ చేశారా? బదిలీ చేసి ఉంటే హ్యాండోవర్ పత్రాలు ఎక్కడ ఉన్నాయి? రికార్డుల గల్లంతుపై గతంలో ఎప్పుడైనా నివేదికలు ఇచ్చారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇది కేవలం ఓ పంచాయతీ కార్యదర్శి సేవా కాలానికి సంబంధించిన అంశంగా మాత్రమే కాకుండా ప్రభుత్వ రికార్డుల పరిరక్షణ, అధికారిక సమాచార నిర్వహణ, ఆర్టీఐ చట్టం కింద సమాచారం అందజేత, ఉద్యోగుల సర్వీస్ రికార్డుల నిర్వహణ వంటి కీలక అంశాలకు సంబంధించినదిగా మారుతోంది. **ఆర్టీఐ సమాచారంలో వ్యత్యాసానికి కారణమేంటి?** సమాచార హక్కు చట్టం ద్వారా ఒక పౌరుడు కోరిన సమాచారాన్ని సంబంధిత కార్యాలయం అందించినప్పుడు, ఆ సమాచారం అందుబాటులో ఉన్న అధికారిక రికార్డుల ఆధారంగా ఉండాలి. అయితే ఒకే అంశంపై గతంలో జారీ చేసిన అధికారిక లేఖలో ఒక విధమైన సమాచారం ఉండగా, ఆర్టీఐ సమాధానంలో మరో విధమైన వివరాలు ఉన్నట్లయితే ఆ వ్యత్యాసానికి కారణం ఏమిటో అధికారులు వివరించాల్సిన అవసరం ఉంది. సమాచారం అందించే సమయంలో పాత రికార్డులను పరిశీలించారా? రికార్డులు లభ్యం కాకపోతే ఆ విషయాన్ని స్పష్టంగా పేర్కొన్నారా? లేక ఇతర ఆధారాల ఆధారంగా వివరాలు ఇచ్చారా? అనే అంశాలు కూడా వెలుగులోకి రావాల్సి ఉంది. **మండల స్థాయి అధికారిగా పదోన్నతిపైనా ప్రశ్నలు** ఇదిలా ఉండగా, ఇదే పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన అధికారి అనంతరం మండల స్థాయి అధికారిగా పదోన్నతి పొందినట్లు సమాచారం. దీంతో సంబంధిత పదోన్నతి ప్రక్రియకు సంబంధించిన సర్వీస్ వివరాల పరిశీలనపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పదోన్నతికి ముందు సదరు ఉద్యోగి సర్వీస్ రికార్డులను పరిశీలించారా? పరిశీలించి ఉంటే ఏ రికార్డులను ఆధారంగా తీసుకున్నారు? సేవా కాలం, విధుల్లో చేరిన తేదీ, బదిలీ, రిలీవింగ్ వివరాలను ఎవరు ధృవీకరించారు? ఆ రికార్డులు ప్రస్తుతం ఎక్కడ ఉన్నాయి? వంటి ప్రశ్నలకు కూడా సమాధానం రావాల్సి ఉంది. అయితే కేవలం పదోన్నతి పొందిన విషయాన్ని ఆధారంగా చేసుకుని ఎలాంటి నిర్ధారణకు రావడం సరికాదని, సంబంధిత అసలు సర్వీస్ రికార్డులను పరిశీలించిన అనంతరం మాత్రమే వాస్తవాలను నిర్ధారించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. **ఉన్నతాధికారుల విచారణకు డిమాండ్** ఒకే ఉద్యోగికి సంబంధించిన సేవా కాలంపై రెండు రకాల అధికారిక సమాచారం ఎందుకు వచ్చింది? అసలు జాయినింగ్, రిలీవింగ్, బదిలీ, పోస్టింగ్ ఉత్తర్వులు ఎక్కడ ఉన్నాయి? నాటి గ్రామపంచాయతీకి సంబంధించిన సర్వీస్ రికార్డులు ప్రస్తుతం ఎవరి ఆధీనంలో ఉన్నాయి? ఆర్టీఐ సమాచారాన్ని ఏ రికార్డు ఆధారంగా అందించారు? రికార్డులు అందుబాటులో లేకపోతే సేవా కాలాన్ని ఏ విధంగా నిర్ధారించారు? అనే అంశాలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని పలువురు కోరుతున్నారు. ముందుగా నాటి గ్రామపంచాయతీకి సంబంధించిన అసలు రికార్డులను గుర్తించి, వాటి హ్యాండోవర్ వివరాలను పరిశీలించి, సర్వీస్ రికార్డులను ధృవీకరించి, వాస్తవ సేవా కాలాన్ని అధికారికంగా నిర్ధారించాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే అధికారిక లేఖ, ఆర్టీఐ సమాధానంలో కనిపిస్తున్న వ్యత్యాసానికి కారణాలను వెల్లడించాలని, రికార్డులు బదిలీ అయి ఉంటే వాటిని గుర్తించాలని, నిజంగానే రికార్డులు గల్లంతై ఉంటే వాటి బాధ్యత ఎవరిదో విచారణ ద్వారా తేల్చాలని కోరుతున్నారు. అసలు రికార్డులు వెలుగులోకి వస్తేనే ఈ సేవా కాలం మిస్టరీకి తెరపడే అవకాశం ఉందని స్థానికులు, సంబంధిత వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# విద్యార్థుల హక్కుల కోసం టీఆర్ఎస్ ఆందోళన

## జీవో-97 రద్దు చేసి స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని

## టిఆర్ఎస్ చీఫ్ కవిత డిమాండ్

## గ్రేటర్ వరంగల్, ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తామని ప్రకటన






**హనుమకొండ ప్రతినిధి, సెప్టెంబర్07(పిసిడబ్ల్యూ న్యూస్):** విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, విద్యా రంగానికి సంబంధించిన జీవో-97ను వెంటనే రద్దు చేయాలని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండ పర్యటనకు వచ్చిన కవితకు టీఆర్ఎస్ గ్రేటర్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన కవిత, విద్యార్థులతో కలిసి అంబేద్కర్ జంక్షన్ నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించిన నిరసన ర్యాలీలో పాల్గొన్నారు. కలెక్టరేట్ ఎదుట పాలిటెక్నిక్ విద్యార్థులతో కలిసి బైఠాయించి నిరాహార దీక్ష నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.. ఈ సందర్భంగా పార్టీ చీఫ్ కవిత మాట్లాడుతూ.. రాష్ట్రంలోని విద్యా వ్యవస్థను కార్పొరేట్ శక్తులకు అప్పగించే విధంగా ప్రభుత్వం జీవో-97ను తీసుకొచ్చిందని ఆరోపించారు. పేద, మధ్యతరగతి విద్యార్థుల చదువులకు భరోసా కల్పించాల్సిన ప్రభుత్వం స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను పెండింగ్‌లో ఉంచడం బాధాకరమన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడకుండా వెంటనే బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రానున్న గ్రేటర్ వరంగల్ మున్సిపల్ ఎన్నికలతో పాటు ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ తెలంగాణ రక్షణ సేన పోటీ చేస్తుందని కవిత ప్రకటించారు. ప్రజల సమస్యల పరిష్కారమే తమ పార్టీ లక్ష్యమని, తెలంగాణ రాజకీయాల్లో ప్రత్యామ్నాయ శక్తిగా టీఆర్ఎస్ ఎదుగుతుందని పార్టీ చీఫ్ కవిత విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, విద్యార్థినీలు, టిఆర్ఎస్ పార్టీ శ్రేణులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఉన్నత చదువులకు పేదరికం అడ్డుకాకూడదు: జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకర.



**కల్లూరు, సెప్టెంబర్ 7 (పిసిడబ్ల్యూ న్యూస్)** :పేదరికం కారణంగా ప్రతిభావంతులైన విద్యార్థుల ఉన్నత చదువులకు ఆటంకం కలగకూడదని జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకర అన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి వారికి అండగా నిలుస్తున్న స్ఫూర్తి ఫౌండేషన్ సేవలు అభినందనీయమని ప్రశంసించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయం ఖమ్మంలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న ఆర్థికంగా వెనుకబడిన ముగ్గురు ప్రతిభావంతులైన విద్యార్థులకు స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 3,15,000/- ఆర్థిక సహాయాన్ని జిల్లా కలెక్టర్ దివాకర్ , జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మేకల వీరాస్వామి, శీలం నాగేశ్వరావు (సురక్ష హాస్పిటల్ మేనేజర్) చేతులమీదుగా చెక్కును విద్యార్థుల తల్లిదండ్రులకు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సమాజంలో ఉన్నత స్థాయికి ఎదగడానికి విద్యే ప్రధాన మార్గమని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులను అధిగమించి పట్టుదలతో చదివి ఐఐటీ ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులను ఆయన అభినందించారు. విద్యార్థుల ఆర్థిక పరిస్థితిని పరిశీలించి ఫౌండేషన్ ఛైర్మన్ ఉయ్యూరీ శ్రీవ్యాల్ అందించిన ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకొని తమ చదువుల్లో మరింత రాణించి, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ప్రతిభావంతులైన విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించేలా ఆర్థిక సహాయం అందించిన ఫౌండేషన్ నిర్వాహకులకు, ధాతలకు, కమిటీ సభ్యులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఆర్థిక సహాయం పొందిన విద్యార్థులు వైరా మండలం శాంతినగర్ చెందినచింతపల్లి పాంతింగ్ 1,22,000/- ఐఐటీ రూర్కీ 4వ సంవత్సరం,తుంపర శ్రావణి 1,00,000/- ఐఐటీ ఇండోర్, మధ్యప్రదేశ్ 1వ సంవత్సరం, గరీబ్‌పేట,కల్లూరు మండలం నకు చెందిన ఆసోదు మనోహర్ 93,000/- ఐఐటీ రూర్కె ఉత్తరా ఖండ్ 1వ సంవత్సరం చదువుతున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్ఫూర్తి ఫౌండేషన్ కమిటీ సభ్యులు ఉబ్బన బాబురావు, జల్ది రామకృష్ణ, ముజీమ్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# హామీల అమలుకు బీఆర్ఎస్ శ్రేణుల నిరసన

## ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల అరెస్టుకు వ్యతిరేకంగా నల్ల బ్యాడ్జీలతో ఆందోళన.. ఎంపీడీవోకు వినతి



**మల్లంపల్లి, సెప్టెంబర్ 7(పిసిడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మల్లంపల్లి మండల బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు సోమవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పిలుపు, ములుగు జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణరావు ఆదేశాల మేరకు మండల అధ్యక్షుడు పాలెపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలు ధరించి జాతీయ రహదారిపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు పాలెపు శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీలు, 420 హామీలను అమలు చేస్తామని ప్రకటించి, అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడిచినా హామీల అమలులో జాప్యం చేస్తోందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆరోపించారు. అసెంబ్లీ సమావేశాలకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నల్ల చొక్కాలు ధరించి హాజరవుతుంటే వారిని అసెంబ్లీ గేటు వద్దే పోలీసులు అడ్డుకుని అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. గతంలో రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నల్ల చొక్కాలు ధరించి పార్లమెంట్ సమావేశాలకు హాజరైనప్పుడు అది ప్రజాస్వామ్య నిరసనగా భావించిన కాంగ్రెస్.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో నల్ల చొక్కాలు ధరించి నిరసన తెలిపితే ఎందుకు అడ్డుకుంటోందని ప్రశ్నించారు. మహిళా ఎమ్మెల్యేలను సైతం పోలీసులు అడ్డుకున్న తీరు సరికాదన్నారు. అసెంబ్లీకి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రావడాన్ని ప్రభుత్వం అడ్డుకోవడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని శ్రీనివాస్ అన్నారు. బీఆర్ఎస్ శాసనసభా పక్ష నేత కేసీఆర్‌ను అసెంబ్లీ సమావేశాలకు రావాలని ఆహ్వానించిన ప్రభుత్వం, ఆయన పార్టీ నాయకులు కేటీఆర్, హరీశ్‌రావులను ఎదుర్కొనే ధైర్యం లేక అరెస్టులకు పాల్పడుతోందని విమర్శించారు. కేసీఆర్ స్వయంగా అసెంబ్లీకి హాజరైతే పరిస్థితి ఎలా ఉంటుందో ప్రభుత్వం ఆలోచించుకోవాలని హితవు పలికారు. **ఎంపీడీవోకు వినతి** అనంతరం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీల్లో భాగంగా ప్రకటించిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ బీఆర్ఎస్ శ్రేణులు మల్లంపల్లి ఎంపీడీవో రెహమాన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చి, సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎంపీటీసీ మాచర్ల ప్రభాకర్, మాజీ సర్పంచులు బోరాల రాజేశ్వరరావు, తిరుపతి, మల్లంపల్లి టౌన్ అధ్యక్షుడు చీదర సంతోష్, సీనియర్ నాయకులు ద్రోణాచారి, కుమార్, ఎండీ రియాజ్, వార్డు సభ్యులు పాషా, గ్రామ కమిటీ అధ్యక్షులు యువరాజ్, అనిల్, రాజ్‌కుమార్, యువజన నాయకులు చోటు, ప్రభాకర్, సంతోష్, రాజు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రమ్ సీడింగ్‌తో పెట్టుబడి వ్యయం తగ్గుతుంది

## - దేవనగర్‌లో వరి పంట ప్రదర్శన క్షేత్రం పరిశీలన



**మల్లంపల్లి,దేవనగర్, సెప్టెంబర్ 7: (పిసిడబ్ల్యూ న్యూస్):** వ్యవసాయ శాఖ ఆత్మ ఆధ్వర్యంలో డ్రమ్ సీడింగ్ విధానంలో సాగు చేసిన వరి పంట ప్రదర్శన క్షేత్రాన్ని దేవనగర్ గ్రామంలో పరిశీలించారు. రైతు శిలుగుల చిన్న ఐలయ్య సాగు చేసిన వరి పంటను మల్లంపల్లి మండల వ్యవసాయ శాఖ అధికారులు,ఆత్మ ప్రతినిధులు పరిశీలించారు. ఈ సందర్భంగా డ్రమ్ సీడింగ్ విధానంలో వరి సాగు చేయడం వల్ల నాటు పద్ధతితో పోలిస్తే పంట కాలం సుమారు 2025 రోజులు తగ్గడంతో పాటు పెట్టుబడి వ్యయం కూడా తగ్గుతుందని అధికారులు తెలిపారు. నాటు పద్ధతితో పోలిస్తే డ్రమ్ సీడింగ్ ద్వారా కూలీల ఖర్చు తగ్గించుకోవడంతో పాటు సమయాన్ని ఆదా చేసుకోవచ్చని పేర్కొన్నారు. డ్రమ్ సీడింగ్ విధానంలో శాస్త్రీయ పద్ధతులను పాటిస్తూ సాగు చేస్తే మంచి దిగుబడులు పొందే అవకాశం ఉందని రైతులకు వివరించారు. ఈ విధానం వల్ల కలిగే ప్రయోజనాలు, సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే మార్గాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీధర్,ఆత్మ డైరెక్టర్ బిలావత్ మల్లిక, వ్యవసాయ విస్తరణ అధికారి జ్యోతి రాణి, రైతులు మద్దెబోయిన కొమురయ్య,కనకం మల్లయ్య,గూడెల్లి సదయ్య, కనకం బిక్షపతి,బక్కి సంపత్,కడారి రామారావు,మామిడి శెట్టి శ్రీనివాస్,కనకం రాజుతో పాటు అగ్రికల్చర్ విద్యార్థులు పాల్గొన్నారు.

# అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములను కాపాడాలి

### సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో గ్రీవెన్స్‌లో ఎంపీడీవో వీరబాబుకు వినతి పత్రం
### సిపిఐ పార్టీ డోర్నకల్ నియోజకవర్గ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి




**కురవి సెప్టెంబర్ 07(పి.సి.డబ్ల్యూ న్యూస్):** భూ కబ్జాదారుల పాలవుతున్న విలువైన ప్రభుత్వ భూములను కాపాడాలని సిపిఐ డోర్నకల్ నియోజకవర్గ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. కురవి మండల కేంద్రంలో అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములను కాపాడాలని ప్రజావాణిలో ఎంపీడీవో వీరబాబు సిపిఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ విలువైన ప్రభుత్వ భూములు ఉన్నప్పటికీ రెవిన్యూ అధికారులు నమ్మకు నేరెత్తినట్లుగా వ్యవహరించడం వలన భూ బకాసురులు బోగస్ పత్రాలతో ఆక్రమించుకుంటున్నారని సర్వే నిర్వహించి ప్రభుత్వ భూములకు హద్దులు నిర్ణయించి సూచిక బోర్డులు పెట్టాలని గతంలో అనేకసార్లు తహిసిల్దార్ కు వినతిపత్రం ఇచ్చినప్పటికీ పెడచెవిన పెట్టడం వలన యదేచ్ఛగా అక్రమనలు జరుగుతున్నాయని, ఎస్సీ హాస్టల్ తో పాటు పలు కార్యాలయాలు ప్రైవేట్ భవనాలలో కిరాయిలకు,ఎంపీడీవో కార్యాలయం శిథిలావస్థలో ఉన్నది కాబట్టి నూతన భవనాల మంజూరి కోసం స్థలాలు కావాలని సాక్షాత్తు ఎమ్మెల్యే గారు రెవిన్యూ అధికారులను కోరినప్పటికీ కాగితాలలో ఉన్న ప్రభుత్వ స్థలాలను గుర్తించకుండా తాత్సర్యం చేయటం,ఇటీవల పలు ఆరోపణలు రెవెన్యూ అధికారులపై వస్తున్నప్పటికీ కనీస స్పందన లేకపోవడంతో పలు అనుమానాలు వస్తున్నాయని,177 సర్వే నెంబర్ లో గత తాహిసిల్దార్ గారు హరిత హోటల్, మహిళలకు పెట్రోల్ బంకులకు,ఎంపీడీవో కార్యాలయానికి స్థలాన్ని ఇస్తానని చెప్పారు కాబట్టి 177 సర్వే నెంబర్ తో పాటు కొరవి గ్రామ కేంద్రంలో ఎంత ప్రభుత్వ భూమి ఉన్నదో తక్షణమే జిల్లా సర్వేయర్ తో సమగ్ర సర్వే చేయించి,హద్దురాళ్ళను సూచిక బోర్డులను కలెక్టర్ గారు ప్రత్యేక చొరవ తీసుకొని ఏర్పాటు చేయించాలని కోరారు సిపిఐ నాయకులు బుడమ వెంకన్న దూది కట్ల సారయ్య కన్న వెంకన్న తదితరులు పాల్గొన్నారు

# సనాతన ధర్మ పరిరక్షణకు బీజేపీ ధార్మిక సెల్ కట్టుబాటు

### - ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఉప్పల్ నియోజకవర్గ ధార్మిక సెల్ నూతన కార్యవర్గం



**ఉప్పల్ సెప్టెంబర్ 07(పిసిడబ్ల్యూ న్యూస్):** మేడ్చల్‌మల్కాజిగిరి అర్బన్ జిల్లా బీజేపీ ఎండోమెంట్ (ధార్మిక) సెల్ ఆధ్వర్యంలో ఉప్పల్ నియోజకవర్గ బీజేపీ ధార్మిక సెల్ నూతన కార్యవర్గ సభ్యులు జిల్లా కన్వీనర్ చంద్ర మౌళి ఆధ్వర్యంలో బీజేపీ సీనియర్ నాయకులు, పూర్వ ఉప్పల్ నియోజకవర్గ శాసనసభ్యులు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు రానున్న రోజుల్లో సనాతన ధర్మ పరిరక్షణ, ఆలయాల సంరక్షణ, ధార్మిక సంప్రదాయాల పరిరక్షణ కోసం ఐక్యంగా పనిచేస్తామని ప్రకటించారు. ధార్మిక అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ, హిందూ ధర్మ పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ ధార్మిక సెల్ జాయింట్ కన్వీనర్ జిల్లా ఇంచార్జ్ తోలేటి వల్లినాథ్, జిల్లా కన్వీనర్ చంద్ర మౌళి, నూతనంగా జిల్లా జాయింట్ కన్వీనర్లుగా నియమితులైన సురేష్ భాలేరావు, తల్లవజ్జుల కమల్ పంత్, కాప్రా డివిజన్ కన్వీనర్ కాళ్లకూరి రవి సీతారాం, మంగిపూడి సోమయాజులు, రాఘవరెడ్డి, విద్యాసాగర్, లక్ష్మారెడ్డి, పద్మా రెడ్డి, సంధారెడ్డి, జీవీఎన్ రావు, ముత్తంరెడ్డి తదితర బీజేపీ ఉప్పల్ నాయకులు, ధార్మిక సెల్ సభ్యులు పాల్గొన్నారు. సనాతన ధర్మ పరిరక్షణే లక్ష్యంగా ముందుకు సాగుతామని ఈ సందర్భంగా నాయకులు స్పష్టం చేశారు.

# అరెస్టులపై గర్జించిన గులాబీ దండు

### - సండ్ర వెంకట వీరయ్య ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ






**సత్తుపల్లి, సెప్టెంబర్ 7 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల పట్ల పోలీసుల వ్యవహారశైలిని నిరసిస్తూ సత్తుపల్లిలో బీఆర్ఎస్ శ్రేణులు భారీ పాల్గొని ఆందోళన చేపట్టాయి. మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సండ్ర వెంకట వీరయ్య ఆధ్వర్యంలో నల్ల కండువాలు, నల్ల జెండాలతో జీవీ మాల్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అసెంబ్లీకి నల్ల టీషర్టులు ధరించి వెళ్లిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను పోలీసులు అడ్డుకోవడం, పలువురు నేతలను అదుపులోకి తీసుకోవడాన్ని సండ్ర వెంకట వీరయ్య తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో ప్రజా సమస్యలను ప్రశ్నించడం ప్రతిపక్షం హక్కు అని, ప్రశ్నించే గొంతును అడ్డుకోవడం సరికాదని అన్నారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల కూడా పోలీసులు వ్యవహరించిన తీరుపై బీఆర్ఎస్ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కేటీఆర్, హరీశ్‌రావు తదితర నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటనపై బీఆర్ఎస్ రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు పిలుపు నిచ్చింది. పార్లమెంట్‌లో నల్ల దుస్తులతో నిరసన తెలిపే హక్కు ఉంటే.. తెలంగాణ అసెంబ్లీలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులకు అదే హక్కు ఎందుకు ఉండకూడదు అని సండ్ర ప్రశ్నించారు. ప్రజా సమస్యలను అసెంబ్లీ వేదికగా లేవనెత్తడం ప్రతిపక్ష బాధ్యత అని, ప్రతిపక్ష నేతలను అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. 1000 రోజుల పాలనపై కాంగ్రెస్‌ను నిలదీసిన సండ్ర కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీల అమలుపై ప్రజల్లో అనేక ప్రశ్నలు ఉన్నాయని సండ్ర వెంకట వీరయ్య అన్నారు. మహిళలకు నెలకు రూ. 2,500, యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్, విద్యార్థులకు స్కూటర్లు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌లో తులం బంగారం, అర్హులైన పేదలకు ఇళ్లు తదితర హామీలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పోరాటం ఆగదని సండ్ర వెంకట వీరయ్య స్పష్టం చేశారు. అసెంబ్లీ నుంచి గ్రామస్థాయి వరకు ప్రజల గొంతుకగా గులాబీ జెండా నిరంతరం పోరాడుతుందని అన్నారు. అనంతరం ప్రజల నుంచి సేకరించిన వివిధ సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను ప్రజావాణి లో అధికారులకు సండ్ర వెంకట వీరయ్య సమర్పించారు.

# అవయవ దానంపై అవగాహన కార్యక్రమం..






**హనుమకొండ సెప్టెంబర్ 7 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కాకతీయ ప్రభుత్వ కళాశాల(స్వ )హనుమకొండ లో ఈరోజు ఎన్ ఎస్ ఎస్ మరియు సదాశయ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలోజాతీయ నేత్రదాన పక్షోత్సావాల సందర్బంగా ప్రిన్సిపాల్ జి. శ్రీనివాస్ అధ్యక్షతన అవయవదానం ఆవశ్యకత పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సభాధ్యక్షులు ప్రిన్సిపాల్ జి. శ్రీనివాస్ మాట్లాడుతూ మరణించిన తర్వాత శరీరం మట్టిలో కలిసే కంటే మన కళ్ళు దానం చేస్తే ఒక్కరు ఇద్దరికి కంటి చూపు ఇచ్చిన వాళ్ళు అవుతారని అన్నారు. సాధాశయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు టి. శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ వ్యక్తి చనిపోయిన వెంటనే కళ్ళు మూసి తడిబట్టి కళ్ల పై ఉంచాలని 8గంటలల లోపల నేత్రాలు సేకరిస్తారని అప్పుడే అవి ఇతరులకు పనికొస్తాయని చెప్పారు. కె పురుషోత్తం జన విజ్ఞాన వేదిక, హనుమకొండ అధ్యక్షులు మాట్లాడుతూ విశ్వాసాలు, సంప్రదాయాల కంటే వైద్య విద్యార్థులకు ప్రయోగ పరీక్ష లకు శవాన్ని అందివ్వటం గొప్ప విషయం అన్నారు. సంస్థ సభ్యు డు వకుళా భరణం శ్రీనివాస్, ఎన్ ఎన్ ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డా. గంగిశెట్టి శ్రీనివాస్, డా. బి సీతారాములు, డా. ఘన్ సింగ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.మాలతీ లత అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గ్రాండ్ పేరెంట్స్ డే, పోషకాహార వారోత్సవం ఘనంగా నిర్వహణ..











**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 07 (పిసిడబ్ల్యూ న్యూస్):** శ్రీ సరస్వతి శిశుమందిర్ హైస్కూల్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గ్రాండ్ పేరెంట్స్ డే మరియు న్యూట్రిషన్ వీక్ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో కుటుంబ విలువలు, పెద్దల పట్ల గౌరవం, ఆరోగ్యం మరియు పౌష్టికాహారం పట్ల అవగాహన పెంపొందించడమే కార్యక్రమాల ముఖ్య ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. న్యూట్రిషన్ వీక్‌లో భాగంగా విద్యార్థులకు వివిధ అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. నిన్న విద్యార్థులకు CBP (Complete Blood Picture) పరీక్షలు నిర్వహించగా, ఈరోజు డా. అనూష విద్యార్థులకు పౌష్టికాహారం ప్రాముఖ్యత, సమతుల్య ఆహారం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్ల గురించి వివరించారు. అదేవిధంగా గ్రాండ్ పేరెంట్స్ డే సందర్భంగా విద్యార్థుల తాత, నానమ్మ, అమ్మమ్మలను పాఠశాలకు ఆహ్వానించి, వారి గ్రాండ్ చిల్డ్రన్‌తో పాదసేవ చేయించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో తాతయ్య, నానమ్మల పట్ల ప్రేమ, గౌరవం మరియు కృతజ్ఞతా భావాలను పెంపొందించే ప్రయత్నం చేశారు. లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు ఎర్రమరాజు సింగమ రాజు గ్రాండ్ పేరెంట్స్ కుటుంబంలో పోషించే కీలక పాత్ర, వారి అనుభవం, ఆప్యాయత మరియు మార్గదర్శకత్వం గురించి విద్యార్థులకు వివరించారు. గ్రాండ్ పేరెంట్స్ ప్రాముఖ్యతపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలో 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తరగతుల వారీగా ప్రథమ, ద్వితీయ బహుమతులను విజేతలకు అందజేశారు. ఈ కార్యక్రమం యొక్క ప్రాముఖ్యతను పాఠశాల ప్రధానాచార్యులు మోర రణధీర్ వివరించారు. పిల్లల వ్యక్తిత్వ వికాసంలో తాతయ్యలు, నానమ్మలు, అమ్మమ్మలు అందించే ప్రేమ, అనుభవం, సంస్కారం ఎంతో విలువైనవని, అలాగే విద్యార్థుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 38వ వార్డు కార్పొరేటర్ దేవసాని సరస్వతీ సత్యం, 36వ వార్డు కార్పొరేటర్ కోడూరి చంద్ర (టింకు అన్న) హాజరయ్యారు. అతిథులుగా పాఠశాల సెక్రటరీ ఇంజనీర్ కోల అన్నారెడ్డి, సభ్యులు తణుకు మహేష్, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ మ్యాడమ్ శివకాంత్ (సాగర్ కలర్ లాబ్), బట్టు వినోద్, మెతుకు కృష్ణ చైతన్య, అయిత సూరజ్, ఆచార్యులు, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. కుటుంబ పెద్దల పట్ల గౌరవం, ఆరోగ్యకరమైన జీవనశైలి, పౌష్టికాహారం యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేసేలా ఈ కార్యక్రమాలు ఆద్యంతం ఉత్సాహంగా కొనసాగాయి.

# మల్లంపల్లిలో 9న మండల స్థాయి ప్రత్యేక సమీక్ష సమావేశం

### - అన్ని గ్రామ పంచాయతీల సర్పంచులు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలి




**మల్లంపల్లి, సెప్టెంబర్ 7:(పిసిడబ్ల్యూ న్యూస్):** మల్లంపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 9వ తేదీ బుధవారం ఉదయం 10.30 గంటలకు మండల స్థాయి ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) ఎం.డి. రహ్మద్దీన్ తెలిపారు. మండల ప్రత్యేక అధికారి అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని గ్రామ పంచాయతీల పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న వివిధ ప్రభుత్వ సేవలు, ఆయా శాఖల పనితీరు, పెండింగ్‌లో ఉన్న సమస్యలు తదితర అంశాలపై సమావేశంలో సమగ్రంగా సమీక్షించే అవకాశం ఉంది. ప్రతి 45 రోజులకు ఒకసారి మండల ప్రజా పరిషత్ సమావేశాలు నిర్వహించాలన్న ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచులు, మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. ఆయా శాఖలకు సంబంధించిన తాజా సమాచారాన్ని అధికారులు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. అలాగే, సంబంధిత శాఖల అధికారులు తమ శాఖకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని సెప్టెంబర్ 8వ తేదీ సాయంత్రంలోపు మండల కార్యాలయ ఈ-మెయిల్‌కు పంపించాలని ఎంపీడీవో ఆదేశించారు. సమావేశం రోజున సంబంధిత సమాచారానికి అవసరమైన జిరాక్స్ ప్రతులను కూడా అందజేయాలని సూచించారు. శాఖల వారీగా చేపట్టిన కార్యక్రమాలు, ప్రగతి, పెండింగ్ అంశాలు, పరిష్కరించాల్సిన సమస్యలు తదితర వివరాలతో అధికారులు సమావేశా నికి హాజరు కావాలని ఎం.డి. రహ్మద్దీన్ కోరారు. సమావేశంలో చర్చించే అంశాలపై ముందస్తుగా పూర్తి స్థాయి సమాచారాన్ని సిద్ధం చేసుకుని రావాలని సూచించారు. మండల స్థాయిలో ప్రభుత్వ కార్యక్రమాల అమలు తీరును సమీక్షించడంతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందేలా తీసుకోవాల్సిన చర్యలపై కూడా సమావేశంలో చర్చ జరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

# హాస్టల్‌లో నీటి కష్టాలు.. విద్యార్థినుల ఆవేదన

**ఏటూరునాగారం ట్రైబల్ వెల్ఫేర్ బాలికల హాస్టల్‌లో దారుణ పరిస్థితుల ఆరోపణలు**

**మూడో అంతస్తు వరకు బకెట్లతో నీరు మోస్తున్నామని విద్యార్థినుల ఆవేదన**

**ప్రశ్నిస్తే వేధింపులకు గురిచేస్తున్నారని వార్డెన్‌పై ఆరోపణలు**

**మీడియాతో మాట్లాడకుండా గదుల్లోకి పంపించారంటూ ఆరోపణలు**











**ములుగు జిల్లా సెప్టెంబర్ 07(పీసీడబ్ల్యూ న్యూస్):** ఏటూరునాగారం మండల కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ బాలికల హాస్టల్‌లో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే ఆరోపణలు వెలువడ్డాయి. హాస్టల్‌లో సరైన నీటి సౌకర్యం లేకపోవడంతో రోజువారీ అవసరాలకు నీటి కోసం విద్యార్థినులు నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వసతులు కూడా సక్రమంగా అందుబాటులో లేకపోవడంతో తమ పరిస్థితి దయనీయంగా మారిందని విద్యార్థినులు తెలిపారు.**మూడో అంతస్తు వరకు బకెట్లతో నీరు**హాస్టల్‌లో తగినంత నీటి సరఫరా లేకపోవడంతో కింద నుంచి బకెట్లలో నీటిని తీసుకుని మూడో అంతస్తు వరకు మోసుకెళ్లాల్సి వస్తోందని విద్యార్థినులు వాపోయారు. చదువుకోవాల్సిన సమయంలో నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని తెలిపారు. తాగునీరు, స్నానాలు, ఇతర నిత్యావసరాలకు నీటి కొరత తీవ్రంగా ఉందని పేర్కొన్నారు.**బాత్రూంలు, మరుగుదొడ్ల దుస్థితి**హాస్టల్‌లోని బాత్రూంలు, మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయని విద్యార్థినులు ఆరోపించారు. పారిశుద్ధ్య పరిస్థితులు సరిగా లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. విద్యార్థినులకు అవసరమైన ప్రాథమిక సౌకర్యాలను కల్పించడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.**ప్రశ్నిస్తే వేధింపులా?**తమ సమస్యలను హాస్టల్ వార్డెన్ దృష్టికి తీసుకెళ్లినప్పుడు బూతులు తిడుతూ, వేధింపులకు గురిచేస్తున్నారని కొందరు విద్యార్థినులు ఆరోపించారు. సమస్యలపై ప్రశ్నించినప్పుడు తమపై దాడి చేసేందుకు ప్రయత్నిస్తున్నారని కూడా వారు వాపోయారు. దీంతో తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి నెలకొందని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు.**రోడ్డెక్కిన విద్యార్థినులు.. కంటతడి**తమ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో తీవ్ర ఆవేదనకు గురైన విద్యార్థినులు హాస్టల్ నుంచి బయటకు వచ్చి రోడ్డుపైకి వచ్చి తమ గోడును మీడియా ముందు వెల్లడించారు. కొందరు విద్యార్థినులు కంటతడి పెట్టి బోరున విలపిస్తూ తమకు న్యాయం చేయాలని కోరారు. హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.**మీడియాతో మాట్లాడకుండా అడ్డుకున్నారంటూ ఆరోపణలు**ఇదిలా ఉండగా, విద్యార్థినులు మీడియాతో మాట్లాడకుండా కొంతమంది ఉపాధ్యాయులు అడ్డుకున్నారని, వారిని తిరిగి గదుల్లోకి పంపించి మీడియాతో మాట్లాడకుండా నిరోధించారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత హాస్టల్ అధికారులు, సిబ్బంది అధికారికంగా స్పందించాల్సి ఉంది.**అధికారుల స్పందన కోసం ఎదురుచూపులు**ములుగు జిల్లా పరిధిలోని గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహంలో విద్యార్థినులు కనీస వసతుల కోసం ఇబ్బందులు పడుతున్నారనే ఆరోపణలు రావడం పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థినుల సమస్యలను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే హాస్టల్‌ను పరిశీలించి వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలని కోరుతున్నారు. హాస్టల్‌లో నీటి సమస్యను తక్షణమే పరిష్కరించడంతో పాటు బాత్రూంలు, మరుగుదొడ్లను మరమ్మతులు చేయించాలని, విద్యార్థినుల ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టాలని విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. మంత్రి సీతక్క ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే గిరిజన సంక్షేమ బాలికల హాస్టల్ విద్యార్థినులు ఇలాంటి సమస్యలను ఎదుర్కొంటున్నారనే ఆరోపణలు రావడం చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారంపై సంబంధిత శాఖ ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సి ఉంది.

## నాణ్యత పరీక్షలకు ఎరువులు, పురుగుమందుల నమూనాలు




**మల్లంపల్లి, సెప్టెంబర్ 7:(పిసిడబ్ల్యూ న్యూస్):** రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగుమందులు అందించాలనే ఉద్దేశంతో మల్లంపల్లి మండలంలో వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి నల్లెల్ల శ్రీధర్ ఆధ్వర్యంలో ఎరువులు, పురుగుమందుల విక్రయ కేంద్రాలను పరిశీలించారు. ఇందులో భాగంగా మల్లంపల్లి మండల కేంద్రంలోని మన గ్రోమోర్ సెంటర్‌ను తనిఖీ చేసి, అక్కడ విక్రయిస్తున్న ఉత్పత్తుల నాణ్యతను పరిశీలించారు. అనంతరం థియోమిథాక్సం పురుగుమందు, 17-17-17 ఎన్‌పీకే కాంప్లెక్స్ ఫెర్టిలైజర్ నమూనాలను సేకరించారు. వీటిని నాణ్యత పరీక్షల కోసం హైదరాబాద్‌లోని సంబంధిత పరీక్ష కేంద్రాలకు పంపించారు. అదేవిధంగా రాంచంద్రాపూర్‌లోని సుధ ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేసి, అక్కడి నుంచి 17-17-17 కాంప్లెక్స్ ఫెర్టిలైజర్ నమూనాను సేకరించారు. ఈ నమూనాను కూడా నాణ్యత పరీక్షలకు పంపించే చర్యలు చేపట్టారు. మండలంలో రైతులకు నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులు అందేలా నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నామని వ్యవసాయ అధికారి నల్లెల్ల శ్రీధర్ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా నాణ్యత లేని ఎరువులు, పురుగుమందులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

## కురవి నాగార్జున స్కూల్‌పై తక్షణమే సమగ్ర విచారణ చేపట్టాలి

- **ఆరోపణలపై అధికారులు మౌనం వీడాలి :**
- **పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్**




**కురవి సెప్టెంబర్ 7 (పి.సి.డబ్ల్యూ న్యూస్):** మండల కేంద్రంలో సోమవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పిడిఎస్యు రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్ నాయక్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కురవి గ్రామపంచాయతీ పరిధిలోని నాగార్జున ప్రైవేట్ స్కూల్ భవన నిర్మాణాలు, అనుమతులు, విద్యాశాఖ గుర్తింపు, భవన భద్రత తదితర అంశాలపై వస్తున్న ఆరోపణలపై అధికారులు తక్షణమే సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. పాఠశాల భవనానికి ఉన్న అనుమతులు, అదనపు నిర్మాణాలకు పంచాయతీ అనుమతులు, విద్యాశాఖ గుర్తింపు, భద్రతా ప్రమాణాలను సంబంధిత అధికారులు పరిశీలించాలని కోరారు. ఆరోపణలు వచ్చినప్పటికీ విచారణలో జాప్యం చేయడం ప్రజల్లో అనుమానాలకు తావిస్తోందన్నారు. గ్రామ పంచాయతీ, రెవెన్యూ, విద్యాశాఖ అధికారులు సంయుక్త తనిఖీలు నిర్వహించి నిజానిజాలను వెలుగులోకి తేవాలని కోరారు. నిబంధనల ఉల్లంఘనలు ఉన్నట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ఆరోపణల్లో వాస్తవం లేకపోతే అధికారికంగా స్పష్టత ఇవ్వాలని అన్నారు. గ్రామసభలో తీసుకున్న తీర్మానాన్ని అమలు చేసి, విచారణ నివేదికను ప్రజలకు అందుబాటులో ఉంచాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్ నాయక్ డిమాండ్ చేశారు. లేనియడల విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరిక చేశారు. ఈ సమావేశంలో పిడిఎస్యు నాయకులు నవిన్, విక్రం , పవన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికే అవమానం

**- మాటకు మర్యాదే నాయకుడి అసలైన ఆభరణం**

**- రాజ్యాంగ పదవుల గౌరవాన్ని కాపాడుకోవాలని రాజకీయ నేతలకు నూతి సత్యనారాయణ గౌడ్ హితవు**

**- తాతా మధుసూదన్ సభ్యత్వంపై చర్యలు తీసుకోవాలని డీసీసీ అధ్యక్షుల డిమాండ్**



**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 7 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రజాస్వామ్యంలో పదవులు మారవచ్చు.. అధికారాలు చేతులు మారవచ్చు.. కానీ రాజ్యాంగం ప్రసాదించిన గౌరవం, ప్రజాస్వామ్య సంస్థల పట్ల చూపాల్సిన మర్యాద మాత్రం ఎప్పటికీ చెక్కుచెదరకూడదని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అన్నారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై శాసనమండలి సభ్యులు తాతా మధుసూదన్ చేసిన వ్యాఖ్యలను జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగబద్ధమైన అత్యున్నత పదవుల్లో ఉన్న వ్యక్తులపై వ్యక్తిగత దూషణలు, అవమానకరమైన వ్యాఖ్యలు చేయడం కేవలం ఒక వ్యక్తిని కించపరచడం మాత్రమే కాదని, ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీయడమేనని పేర్కొన్నారు. రాజకీయ విభేదాలు ఉండవచ్చు, విధానాలపై విమర్శలు చేయవచ్చు, కానీ మాటల్లో సంయమనం కోల్పోయి వ్యక్తిత్వాలను కించపరచడం నాయకత్వ లక్షణం కాదని స్పష్టం చేశారు. “మాట మనిషి వ్యక్తిత్వానికి అద్దం.. హుందాతనం నాయకుడి అసలైన గుర్తింపు” అని నూతి సత్యనారాయణ గౌడ్ పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు మాట్లాడే ప్రతి మాట సమాజంపై ప్రభావం చూపుతుందని, ముఖ్యంగా యువతకు రాజకీయ నాయకులే ఆదర్శంగా నిలవాల్సిన సమయంలో అసభ్యకర, అవమానకర భాష ప్రజాస్వామ్య సంస్కృతికి ఏమాత్రం మంచిది కాదన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇచ్చే రాజకీయ శిక్షణ ఇదేనా? అని ఆయన ప్రశ్నించారు. బాధ్యతాయుతమైన శాసనమండలి సభ్యుడి పదవిలో కొనసాగుతూ తాతా మధుసూదన్ ఇటువంటి వ్యాఖ్యలు చేయడం సమాజం హర్షించదన్నారు. రాజకీయ విమర్శలకు కూడా ఒక హద్దు ఉంటుందని, ఆ హద్దును దాటి వ్యక్తిగత దూషణలకు దిగడం ప్రజా జీవితానికి మంచిది కాదని హితవు పలికారు. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలు సహజమే అయినప్పటికీ, అభిప్రాయ భేదాలు వ్యక్తిగత విద్వేషాలుగా మారకూడదని అన్నారు. అధికార పక్షమైనా, ప్రతిపక్షమైనా రాజ్యాంగం నిర్దేశించిన పరిధిలోనే తమ రాజకీయ బాధ్యతలను నిర్వర్తించాలని సూచించారు. ముఖ్యంగా రాజ్యాంగబద్ధ పదవులపై మాట్లాడేటప్పుడు ప్రతి నాయకుడు తన మాటల తీవ్రతను, వాటి సామాజిక ప్రభావాన్ని గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ వ్యాఖ్యలు దళిత సమాజాన్ని కూడా తీవ్రంగా కలచివేశాయని నూతి సత్యనారాయణ గౌడ్ పేర్కొన్నారు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని హామీ ఇచ్చి ఆ వర్గాల ఆకాంక్షలను నెరవేర్చలేదని బీఆర్ఎస్‌పై విమర్శలు చేశారు. దళితుల ఆత్మగౌరవం గురించి మాట్లాడే నాయకులు ముందుగా తమ మాటల్లో సంస్కారం, చేతల్లో చిత్తశుద్ధి చూపాలని అన్నారు. రాజకీయాల్లో గెలుపోటములు తాత్కాలికమని, కానీ నాయకులు సమాజానికి అందించే సంస్కారం శాశ్వతమని పేర్కొన్నారు. అసభ్య పదజాలం చప్పట్లు తెచ్చిపెట్టవచ్చు.. కానీ గౌరవాన్ని సంపాదించలేదని, ఆవేశం క్షణికమైనదైనా మాటల వల్ల కలిగే గాయం దీర్ఘకాలం నిలిచిపోతుందని రాజకీయ నాయకులు గుర్తించాలన్నారు. ప్రజల సమస్యలపై గొంతెత్తాల్సిన ప్రజాప్రతినిధులు వ్యక్తిగత విమర్శలు, అవమానకర వ్యాఖ్యలతో విలువైన సభా సమయాన్ని వృథా చేయడం తగదన్నారు. రాజకీయ నాయకుల మాటలు సమాజానికి దిక్సూచిగా ఉండాలని, ద్వేషాన్ని పెంచేవిగా కాకుండా సామరస్యాన్ని పెంపొందించేవిగా ఉండాలని సూచించారు. రాజ్యాంగ పదవుల గౌరవాన్ని కాపాడటం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత అని, ఈ విషయంలో రాజకీయ పార్టీలకతీతంగా అందరూ స్పందించాలని నూతి సత్యనారాయణ గౌడ్ పిలుపునిచ్చారు. అనుచిత వ్యాఖ్యల విషయంలో తాతా మధుసూదన్‌పై కఠిన చర్యలు తీసుకుని, అవసరమైతే ఆయన శాసనమండలి సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. “విమర్శించండి.. కానీ విలువలను విడిచిపెట్టవద్దు. విభేదించండి.. కానీ వ్యక్తిత్వాలను అవమానించవద్దు. రాజకీయాలు చేయండి.. కానీ రా జ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని గౌరవించండి” అనే సందే శాన్ని ప్రతి రాజకీయ నాయకుడు తన నడవడికలో ఆచరించాలని నూతి సత్యనారాయణ గౌడ్ హితవు పలికారు.

## అవంతి పీజీ కళాశాలలో ఘనంగా విద్యారంభం2026’

**పరిశ్రమ నైపుణ్యాలతో ఉన్నత ఉద్యోగాలను లక్ష్యంగా పెట్టుకోవాలి: ఓయూ ప్రొఫెసర్ ఇంద్రకంటి శేఖర్**






**హైదరాబాద్ సెప్టెంబర్ 07 (పిసిడబ్ల్యూ న్యూస్):** బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అవంతి డిగ్రీ & పీజీ కళాశాల ఆధ్వర్యంలో నూతనంగా చేరిన ఎంబీఏ, ఎంసీఏ ప్రథమ సంవత్సర విద్యార్థులకు ‘విద్యారంభం2026’ పేరిట ఓరియంటేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల విద్యా వాతావరణం, మౌలిక వసతులు, విద్యార్థుల సమగ్ర వికాసానికి అందుబాటులో ఉన్న అవకాశాలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉస్మానియా విశ్వవిద్యాలయం కామర్స్ & బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇంద్రకంటి శేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యాభ్యాసంలో ఉన్నత ప్రమాణాలు సాధించి, ఎంఎన్‌సీ సంస్థల్లో లెవల్2 స్థాయి ఉద్యోగాలను లక్ష్యంగా ఎంచుకోవాలని సూచించారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో చురుగ్గా పాల్గొంటూ ప్రాక్టికల్ పరిజ్ఞానాన్ని, పరిశ్రమ అనుభవాన్ని ఒడిసిపట్టుకోవాలని పిలుపునిచ్చారు. జేఎన్‌టీయూహెచ్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ప్రొఫెసర్ సంతోష్ కుమారి మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే ప్రాక్టికల్ నాలెడ్జ్‌తో పాటు కార్పొరేట్ రంగానికి తగిన నైపుణ్యాలను అలవర్చుకోవాలన్నారు. అలాగే ఉస్మానియా విశ్వవిద్యాలయ కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన డాక్టర్ బి. సుజాత మాట్లాడుతూ.. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో తమ ప్రతిభను పదునుపెట్టుకుని ఉజ్వల కెరీర్‌ను నిర్మించుకోవాలని దిశానిర్దేశం చేశారు. అవంతి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ వ్యవస్థాపక చైర్మన్, సీఈవో ఎం. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. విద్యార్థులు కళాశాలలోని విద్యా వనరులను, అధునాతన సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని అత్యుత్తమ ప్లేస్‌మెంట్లు సాధించాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణ, నిబద్ధతతో శ్రమించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని తల్లిదండ్రులు, విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అతిథిగా బ్రహ్మకుమారీస్ ప్రతినిధి సిస్టర్ అంజలి, జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎం. ప్రజ్ఞ కుమార్, హెచ్‌ఆర్ డైరెక్టర్ డాక్టర్ వై. జయప్రద, ప్రిన్సిపాల్స్ ప్రొఫెసర్ ఎస్. అప్పారావు, డాక్టర్ ఎస్. నాగరాజులతో పాటు కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# చింతపల్లి జడ్పీహెచ్ఎస్ లో కబడ్డీ, కోకో, వాలీబాల్ క్రీడలకు మండల స్థాయి సెలక్షన్ లు

**క్రీడలు పిల్లల్లో క్రమశిక్షణ, మానసిక స్థైర్యాన్ని పెంపొందిస్తాయి.**

**- ప్రధానోపాధ్యాయులు భానోతూ శంకర్ నాయక్**

**పిల్లలు అంతా కూడా చక్కగా తమ ప్రతిభను కనబరిచి జిల్లా స్థాయిలో మన మండల పేరును నిలబెట్టాలి**

**చింతపల్లి సర్పంచ్,సీరోల్ మండల ఎస్టీ సెల్ ధీరవత్ వీరన్న నాయక్**






**సీరోల్ సెప్టెంబర్ 07(పి.సి.డబ్ల్యూ న్యూస్):**70 వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సీరోల్ మండల స్థాయి కబడ్డీ, ఖో ఖో,వాలీబాల్ క్రీడలకు సంబంధి 14 సంవత్సరాల లోపు బాలురు బాలికలు ,17 సంవత్సరాల విభాగంలో బాలురు బాలికల సీరోల్ సెలక్షన్స్ జడ్పీహెచ్ఎస్ చింతపల్లి నందు నిర్వహించడం జరిగింది . ఈ సందర్భంగా జడ్.పి.హెచ్.ఎస్ చింతపల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఎఫ్ ఏ ఓ బానోత్ శంకర్ నాయక్ మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలు కూడా ఎంతో అవసరమని క్రీడలో పిల్లల్లో మానసికస్థైర్యాన్ని, సహకార గుణాన్ని, గెలుపు ఓటములను తట్టుకునే మనోబలాన్ని ఇచ్చి ముమ్ముందు ఎదురయ్యే ఏ పరిస్థితులను అయినా సులభంగా ఎదుర్కొనే శక్తి,సామర్థ్యాలను పొందుతారని,చదువుతో పాటు ఆటలు కూడా విద్యార్థులకు అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి , కొత్తూరు- సి, కాంపల్లి, జడ్పీహెచ్ఎస్ సీరోల్, ఈఏంఆర్ఎస్ సీరోల్ ఉపారగూడెం,,చిలుకోయలపాడు, మన్నెగూడెం పాఠశాలల కు సంబంధించిన విద్యార్థులు భాగస్వామ్యమవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపైర్స్ గా బి.భారతి , జ్యోతి , వివిధ పాఠశాలల. పి డి లు యశ్వీర్ సింగ్, కోమల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.ఇంకా ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ధీరవత్ వీరన్న పాల్గొని మాట్లాడుతూ పిల్లల అభివృద్ధికి ఆటలు ఎంతగానో సహకరిస్తాయని కావున పిల్లలు అంతా కూడా చక్కగా తమ ప్రతిభను కనబరిచి జిల్లా స్థాయిలో మన మండల పేరును నిలబెట్టాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు సజ్జనము విద్యాసాగర్, మక్కళ్ళ బిక్షం, సత్తార్, జయసుధ,త్రివేణి,నాగరాణి, దివ్యజ్యోతి, వెంకన్న, హెల్త్ డిపార్ట్మెంట్ ఏఎన్ఎం జ్యోతి ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# దళితులను కించపరిస్తే సహించం

**● బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధుబాబు పై కాంగ్రెస్ ఎస్సి సెల్ ఫైర్**

**● స్పీకర్ గడ్డం ప్రసాద్ పై అనుచిత వ్యాఖ్యలు - వెనక్కి తీసుకోకపోతే చెప్పు దెబ్బలు తప్పవు : కొరివి అరుణ్ కుమార్ హెచ్చరిక ● తాత మధుబాబు పై SC/ST అట్రాసిటీ కేసు నమోదు చేయాలి - కాంగ్రెస్ ఎస్సి సెల్ డిమాండ్ ● కరీంనగర్‌లో తాత మధుబాబు దిష్టిబొమ్మ దహనం ● దళితులను కించపరిస్తే సహించబోం: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధుబాబు వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఆగ్రహం**



**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 07(పిసిడబ్ల్యూ న్యూస్):** స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధుబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలు చాలా బాధాకరమని, దళితులను కించపరిస్తే సహించబోమని కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకుడు కొరివి అరుణ్ కుమార్ తీవ్రంగా ఖండించారు.ఒక ఉన్నతమైన స్పీకర్ స్థాయిలో ఉన్న వ్యక్తిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం బీఆర్ఎస్ పార్టీ దళిత వ్యతిరేక వైఖరికి నిదర్శనమని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ మొదటి నుండి దళితులను చిన్నచూపు చూస్తోందని, వారి ఆత్మగౌరవానికి భంగం కలిగిస్తే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు.తాత మధుబాబు తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేకపోతే చెప్పు దెబ్బలు తప్పవని హెచ్చరించారు. వెంటనే తాత మధుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం ప్రకారం కేసు నమోదు చేసి జైలుకు పంపాలని డిమాండ్ చేశారు.మానకొండూర్ శాసనసభ్యులు డా. కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు ఈరోజు జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించి, తాత మధుబాబు దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎండి తాజుద్దీన్, జీడి రమేష్, మీసాల సాయిలు, నాయకులు అబ్దుల్ రెహమాన్, ముల్కల కవిత, హస్త పురం తిరుమల, తీట్ల ఈశ్వరి, బత్తుల రాజ్ కుమార్, ఫహాద్, జక్కుల అఖిలేష్, బుర్ర రాహుల్, యనమల మంజుల, కాంపల్లి కీర్తి కుమార్, పెద్ది గారి తిరుపతి , ఎండి చాంద్ , తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ గడ్డపై టీఆర్ఎస్ విస్తరణకు శ్రీకారం

**తరాలపల్లిలో పార్టీ జెండా ఆవిష్కరించిన టిఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత**

**గ్రేటర్ ఎన్నికల్లో అన్ని డివిజన్లలో పోటీ చేస్తాం.. ప్రజా సమస్యలే పార్టీ అజెండా**

**టిఆర్ఎస్ చీఫ్ కవితకు ఘనంగా స్వాగతం పలికిన టిఆర్ఎస్ లీడర్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వెంకటేశ్వర్ రావు**




**హనుమకొండ, సెప్టెంబర్ 07 (పిసిడబ్ల్యూ న్యూస్):**తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) రాష్ట్రవ్యాప్త సంస్థాగత విస్తరణలో భాగంగా పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సోమవారం వరంగల్ జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. పర్యటనలో భాగంగా.., హనుమకొండలో విద్యార్థులతో కలిసి నిరాహార దీక్షలో పాల్గొన్న ఆమె, అనంతరం తరాలపల్లి గ్రామానికి చేరుకుని పార్టీ జెండాను ఆవిష్కరించి కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు.కవితకు టీఆర్ఎస్ గ్రేటర్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు లయన్ డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత ఘన స్వాగతం పలికారు. జై తెలంగాణ, టీఆర్ఎస్ నినాదాలతో తరాలపల్లి మారుమోగింది.ఈ సందర్భంగా పార్టీ చీఫ్ కవిత మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలకు ప్రత్యామ్నాయ రాజకీయ వేదికను అందించాలనే లక్ష్యంతో తెలంగాణ రక్షణ సేనను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అధికార రాజకీయాలకు భిన్నంగా ప్రజల సమస్యల పరిష్కారమే తమ పార్టీ ప్రధాన అజెండా అని స్పష్టం చేశారు. విద్య, వైద్యం ప్రతి కుటుంబానికి అందుబాటులో ఉండేలా ప్రజలపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా విధానాలను అమలు చేయడమే తమ సంకల్పమన్నారు."గత రెండు దశాబ్దాలుగా ప్రజల మధ్యనే ఉన్నాను. మీ ఆశీర్వాదంతో సేవ చేసేందుకు ఈ రాజకీయ వేదికను ఏర్పాటు చేశాం. సమాజంలోని ప్రతి వర్గానికి సామాజిక న్యాయం జరిగేలా, ప్రతి కుటుంబం అభివృద్ధి చెందేలా కృషి చేస్తాం" అని ఆమె పేర్కొన్నారు.పార్టీ జెండాలోని పసుపు రంగు శుభానికి, ధైర్యానికి, ప్రజా సంకల్పానికి ప్రతీక అని వివరిస్తూ, ప్రజలతో మమేకమై పనిచేసే నాయకత్వానికే తమ పార్టీ ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు. రానున్న గ్రేటర్ వరంగల్ మున్సిపల్ ఎన్నికల్లో అన్ని డివిజన్లలో పార్టీ అభ్యర్థులను బరిలోకి దింపనున్నట్లు ప్రకటించారు.**పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు** పర్యటనలో భాగంగా తరాలపల్లిలో నిర్వహించిన పోచమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో కవిత పాల్గొన్నారు. అమ్మవారికి నూతన వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం తీర్థప్రసాదం స్వీకరించిన కవిత భక్తులతో ఆత్మీయంగా ముచ్చటించారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు, యువజన విభాగం ప్రతినిధులు, విద్యార్థులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కొత్తపల్లిలో ఆరు ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం.




**కరీంనగర్ జిల్లా సెప్టెంబర్7(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని కొత్తపల్లి 17, 18వ డివిజన్లలో నిర్మించిన ఆరు ఇందిరమ్మ ఇళ్లను అర్బన్ డీసీసీ అధ్యక్షుడు వి. అంజన్ కుమార్ ప్రారంభించారు. కాంగ్రెస్ నాయకులతో కలిసి లబ్ధిదారుల ఇళ్లను ప్రారంభించి, వారిని అభినందించారు.ఈ సందర్భంగా అంజన్ కుమార్ మాట్లాడుతూ.. కొత్తపల్లి పట్టణంలో ప్రస్తుతం సుమారు 120 ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయని, ఇప్పటికే 50కిపైగా ఇళ్లలో గృహప్రవేశాలు పూర్తయ్యాయని తెలిపారు. రాబోయే రోజుల్లో కరీంనగర్ నియోజకవర్గానికి సుమారు 1,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యే అవకాశం ఉందని, తద్వారా కొత్తపల్లిలో మరింత మంది అర్హులైన పేదలకు సొంతింటి కల నెరవేరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.కొత్తపల్లికి చెందిన వేముల రేఖ, జంగాలపల్లి లింగేష్, బీరయ్య, వోడ్నాల అన్నపూర్ణ, కొలిపాక మహేష్, ఎడ్ల అంజయ్య తదితరుల ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో 17వ డివిజన్ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, 18వ డివిజన్ అధ్యక్షుడు పున్నం శ్రీనివాస్, చిలుక హనుమంత రెడ్డి, గున్నాల రమేష్, మడుపు మోహన్, బొమ్మ ఈశ్వర్, దుబ్బాసి కుమార్, తుమ్మ ప్రతాప్ రెడ్డి, జేరిపోతుల వాసు, వికార్ అహ్మద్ ఖాన్, సంఘం మునీందర్, శ్రీనివాస్, భూసా వీరేశం, రాపర్తి రాజు, బైరి మహేష్, పొన్నం భూమా గౌడ్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో ఉద్రిక్తత....అసెంబ్లీ' ముట్టడికి యత్నించిన కరీంనగర్ జిల్లా బిజెపి నేతలు..

**కరీంనగర్ బిజెపి జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం , మాజీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అరెస్ట్ .......**




**హైదరాబాద్ సెప్టెంబర్ 07(పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ "ఫీజు బకాయి - బీజేపీ లడాయి" కార్యక్రమంలో భాగంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు ఆధ్వర్యంలో సోమవారం రోజున హైదరాబాదులో ఉండ తలపెట్టిన చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. అసెంబ్లీ ముట్టడి కోసం కరీంనగర్ బిజెపి జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేష్ ఆధ్వర్యంలో తరలి వెళ్లిన బీజేపీ శ్రేణులను పోలీసులు అడ్డుకుని ముందస్తు అరెస్టులు చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం తో పాటు మాజీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుగొండ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడవెంకటరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు గుర్రాల వెంకటరెడ్డి, సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాసరావు, కరివేద మహిపాల్ రెడ్డి , పుప్పాల రఘు , బల్బీర్ సింగ్, అడిచెర్ల రాజు , యువర్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు నేరెళ్ల ప్రవీణ్ రెడ్డి, జిల్లా యువ మోర్చా అధ్యక్షులు సంఘ నరేష్, ఓబీసీ మోర్చా అధ్యక్షులు ఆకుల రాజేందర్, మండల అధ్యక్షులు రాజిరెడ్డి, అనిల్ , చింతం శ్రీనివాస్, హరీష్ , దళిత మూర్ఛ నాయకులు అనిల్ లతో పాటు పలువురు ముఖ్య నాయకులను, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు. **ప్రభుత్వ నిరంకుశత్వానికి ఈ అరెస్టులే నిదర్శనం** బీజేపీ నేతల అక్రమ అరెస్టులపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం, మాజీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం శాంతియుతంగా నిరసన తెలియజేస్తుంటే ప్రభుత్వం పోలీసులను ఉపయోగించి అణచివేయాలని చూస్తోం దని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో సుమారు ₹15,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోవడం వల్ల లక్షలాది మంది నిరుపేద విద్యార్థులు, విద్యాసంస్థలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అసలు ప్రభుత్వానికి బకాయలు చెల్లించే ఉద్దేశం ఉందా లేదా అని వారు ప్రశ్నించారు. ఈ విషయంలో ప్రభుత్వం దాటవేత ధోరణి అవలంబిస్తుందని, విద్యార్థుల బకాయిలన్నీ పూర్తిగా చెల్లించే వరకు తాము వెనకడుగు వేసే ప్రసక్తి లేదని, బీజేపీ లడాయి పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని వారు స్పష్టం చేశారు.**కరీంనగర్లో అసెంబ్లీ కో కన్వీనర్ గుర్రం వెంకటేష్ గౌడ్ అరెస్ట్...**చలో అసెంబ్లీ కార్యక్రమానికి హైదరాబాద్ తరలి వెళుతున్న ఫీజుల బకాయి.. బిజెపి లడాయి కరీంనగర్ అసెంబ్లీ కో కన్వీనర్ గుర్రం వెంకటేష్ గౌడ్ ను కరీంనగర్ పోలీసులు అరెస్టు చేసి , స్టేషన్ కు తరలించారు . ~ గుర్రం వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని ప్రశ్నించే గొంతుకులను అణిచివేసే ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. విద్యార్థులకు న్యాయంగా ఇవ్వాల్సిన ఫీజు బకాయిలు చెల్లించకుండా, కాంగ్రెస్ సర్కార్ దుర్మార్గంగా వ్యవహరిస్తుందన్నారు. శాంతియుత పద్ధతిలో నిరసన తెలియజేసేందుకు బిజెపి చలో అసెంబ్లీ కార్యక్రమం చేపడితే పోలీసులు అక్రమంగా అరెస్టు అరెస్టు చేయించడం ప్రభుత్వానికి తగదన్నారు.

# విద్యార్థులను గోస పెడుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఇక మనుగడ లేదు..

**- కాంగ్రెస్ సర్కారుకు కౌంట్ డౌన్ ప్రారంభమైంది: బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి...**




**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 07 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు చెల్లించకుండా విద్యార్థులను గోస పెడుతున్న రేవంత్ రెడ్డి ఇక ప్రభుత్వానికి మనుగడ లేదనీ, విద్యార్థులతో పెట్టుకున్న ప్రభుత్వానికి కౌంట్ డౌన్ ప్రారంభమైందని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి ఘాటుగా విమర్శించారు. ఫీజు రియంబర్స్మెంట్ బకాయలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం రోజున హైదరాబాదులో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు ఆధ్వర్యంలో తలపెట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమంలో తిమ్మాపూర్ మండల బిజెపి నేతలు పాల్గొన్నారు. చలో అసెంబ్లీ ప్రోగ్రామ్ సందర్భంగా అసెంబ్లీ వైపు తల్లి వెళ్ళిన తిమ్మాపూర్ బీజేపీ నాయకులు కార్యకర్తలను అరెస్టు చేసి అఫ్జల్ గంజ్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ అక్రమ అరెస్ట్ లపై రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ చెల్లించకుండా వారి భవిష్యత్తు తో చెలగాటం పడుతుందని మండిపడ్డారు. విద్యార్థులు పై చదువు లేక పోతున్నారని, కొంతమంది విద్యార్థులు ఆత్మ హత్యలకు పాల్పడే పరిస్థితి వచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు చెల్లించి విద్యార్థులను ఆదుకోవాలని లేకపోతే బిజెపి ఆధ్వర్యంలో పోరాటాలను ఉదృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు సంజీవ రెడ్డి, కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రాల వెంకట్ రెడ్డికిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివెద మహిపాల్ రెడ్డి, తిమ్మాపూర్ మండల అధ్యక్షులు చింతం శ్రీనివాస్, మండల కిసాన్ మోర్చా కార్యదర్శులు మధుకర్ రెడ్డి, శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎంఎల్ఏ యశస్విని రెడ్డి సహాయ, సహకారాలతో గుర్తూరు నుండి ఎయిమ్స్‌కు ప్రారంభించిన ఆర్టీసీ బస్సు..




**- ఆర్టీసీ బస్సును కొబ్బరిమట్టలతో ముస్తాబు చేసి కొబ్బరికాయ సమర్పించి బస్సును ప్రారంభించిన గ్రామ సర్పంచ్ వి .కవిత బాలకృష్ణ .**

**- అనారోగ్యంతో బాధపడుతున్న బాధితులకు మంచి అవకాశం ఈ బస్సు.**

**- మొదటి రోజే 6 మంది ప్రయాణికులు బయలుదేరి ఎయిమ్స్ కువెళ్లారు.**

**- అన్ని గ్రామ పంచాయతీ ప్రజలు అందరికీ అందుబాటులో ఉండే ఈ బస్సును సద్వినియోగం చేసుకోవాలని కోరిన సర్పంచ్ కవితా బాలకృష్ణ.**









**తొర్రూరు ప్రతినిధి, సెప్టెంబర్ 7(పిసిడబ్ల్యూ న్యూస్):** గత మూడు నెలల నుండి గ్రామ సర్పంచులు ఈ బస్సు సౌకర్యం కోసం పోరాటం చేస్తూనే ఉన్నారు. బీబీనగర్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఎయిమ్స్ ఆసుపత్రి నిరుపేద రోగుల కోసం అన్ని రకాల సదుపాయాలతో ప్రారంభించిన సందర్భంగా మారుమూల ఉన్న పల్లె ప్రాంతాల ప్రజలు అనారోగ్యంతో బాధపడేవారు బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆయా గ్రామ సర్పంచ్ లను బస్సు ను ఏర్పాటు చేయాలని వేడుకున్న గ్రామస్తులు. సానుకూలంగా బస్సు కోసం ప్రయత్నించి విఫలం కాకుండా ఎంతో మంది రోగులకు సహాయం చేయాలని ఉద్దేశంతో గుర్తుర్ గ్రామ సర్పంచ్ వి. కవిత బాలకృష్ణ తోపాటు గట్టికల్లు మాజీ సర్పంచ్ కాసినాదం శ్రమ ఫలించిన వేళ. 3 నెలల నుండి పాలకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే యశస్విని రెడ్డిని బస్సు విషయంలో తరచు కలవడంతో సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మహబూబాబాద్ బస్ డిపో మేనేజర్ కు ఫోన్ ద్వారా సంప్రదించి పాలకుర్తి నియోజకవర్గం లోని పల్లె ప్రాంతాలను కలుపుకుంటూ బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని తెలిపిన వెంటనే మహబూబాబాద్ జిల్లా ఆర్టీసీ బస్ డిపో మేనేజర్ స్పందించి గ్రామ ప్రాంతాలలో ఉన్న అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఈ బస్సు ఎంతో ఉపయోగపడుతుందని బస్సును ప్రారంభించారు. గుర్తుర్ నుండి బయలుదేరిన బస్సులో మొదటి టికెట్టు గ్రామ సర్పంచ్ కవిత బాలకృష్ణ కొనుగోలు చేశారు. అనంతరం బస్సులో 6 మంది ప్రయాణికులతో బస్సు బయలుదేరి వెళ్ళింది.ప్రతిరోజు సూపర్ ఎక్స్ప్రెస్ బస్సు మహబూబాబాద్ లో ఉదయం 4. 30 కి బయలుదేరి నెల్లికుదురు, మడి పెల్లి, కంటాయపాలెం, మార్గం ద్వారా గుర్తుర్ 5:40 కి చేరుకుంటుంది. ఇక్కడి నుండి ఈ బస్సు ఊకల్లు, గట్టికల్లు, పెరికేడు, రాయపర్తి, రామన్నపేట నుండి పాలకుర్తి కి చేరుకుంటుంది. అక్కడి నుండి జనగాం, భువనగిరి ద్వారా ఎయిమ్స్ 9:30 కి చేరుకుంటుంది. తిరిగి ఆ బస్సు ఉప్పల్ ఎక్స్ రోడ్డుకు 10 గంటలకు చేరుకుంటుందని బస్సు కండక్టర్ తెలిపారు. అదే బస్సు తిరుగు ప్రయాణంలో 11 గంటలకు ఉప్పల్ ఎక్స్ రోడ్ నుండి బయలుదేరి ఎయిమ్స్, భువనగిరి, జనగాం, పాలకుర్తి, రాయపర్తి, గట్టికల్లు ,గుర్తుర్, నెల్లికుదురు, మహబూబాబాద్ కు సాయంత్రం వరకు చేరుకుంటుందని తెలిపారుఈ బస్సును అడిగిన వెంటనే ప్రారంభించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి అన్ని గ్రామాల సర్పంచులతోపాటు ప్రయాణికులు కూడా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మారుమూల పల్లెలో బస్సు సౌకర్యాలు లేక ఇన్ని రోజులు అనేక అవస్థలు పడిన గ్రామస్తులకు ఎంతో ఊరట కలిగిందని వారు పేర్కొన్నారు .ఈ బస్సు కాలేజీ విద్యార్థులకు, వృద్ధులకు విద్యావంతులకు అందరికీ ఉపయోగపడేలా సౌకర్యం కల్పించిన ఆర్టీసీ మహబూబాద్ డిపో మేనేజర్ కూడా ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నారు. ఇది ఆధార్ కార్డు బస్సు ప్రయాణికులు ఈ బస్సును సద్వినియోగం చేసుకొని విజయవంతంగా అందరికీ ఉపయోగపడేలా చూస్తూ అడిగిన వెంటనే ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పేరును నిలబెట్టాలని గుర్తుర్ గ్రామ సర్పంచ్ వి. కవిత బాలకృష్ణ కోరారు..

# రైతుల విజ్ఞప్తికి తక్షణ స్పందన.. సాగర్ ఆయకట్టుకు గోదావరి జలాలు

**పంటలు ఎండిపోకుండా చర్యలు..**
**ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌తో చర్చించి నీటి విడుదలకు కృషి చేసిన మంత్రి తుమ్మల**

**ఖమ్మం,సెప్టెంబర్ 7(పిసిడబ్ల్యూ న్యూస్):** సాగర్ ఆయకట్టు పరిధిలో సాగు చేస్తున్న రైతుల పంటలకు నీటి కొరత ఏర్పడకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టింది. రైతుల విజ్ఞప్తి మేరకు వైరా, లంకసాగర్ రిజర్వాయర్ల పరిధిలోని సాగర్ ఆయకట్టుకు గోదావరి జలాలను విడుదల చేయించినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. పంటలు ఎండిపోయి రైతులు నష్టపోకుండా అవసరమైన నీటిని అందించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు తీసుకుంటోందని ఆయన పేర్కొన్నారు.తల్లాడ మండలంలో సోమవారం పర్యటించిన మంత్రి తుమ్మల దృష్టికి పలువురు రైతులు సాగర్ ఆయకట్టు పరిధిలో పంటలకు నీరు అత్యవసరంగా అవసరమని, సకాలంలో నీరు అందకపోతే పంటలు ఎండిపోయే పరిస్థితి ఉందని వివరించారు. రైతుల సమస్యను గుర్తించిన మంత్రి వెంటనే స్పందించి జిల్లా కలెక్టర్, ఇరిగేషన్ శాఖ అధికారులతో చర్చించారు. పంటల పరిస్థితిని పరిశీలించి, నీటి అవసరాలను అంచనా వేసి తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సోమవారం అసెంబ్లీలో రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేకంగా సమావేశమై సాగర్ ఆయకట్టు పరిధిలోని పరిస్థితిని వివరించారు. వైరా, లంకసాగర్ రిజర్వాయర్ల పరిధిలో సాగు చేస్తున్న పంటలను కాపాడేందుకు గోదావరి జలాలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో మోటార్లు ఆన్ చేసి గోదావరి జలాలను సాగర్ ఆయకట్టుకు విడుదల చేశారు.రైతుల పంటలను కాపాడటమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. సాగర్ ఆయకట్టు పరిధిలో నీటి సరఫరాను ఇరిగేషన్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రస్తుతం ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అందుబాటులో ఉన్న నీటిని రైతులు పొదుపుగా, జాగ్రత్తగా వినియోగించుకోవాలని సూచించారు.సాగర్ ఆయకట్టు రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి భరోసా ఇచ్చారు. రైతుల ప్రయోజనాల విషయంలో ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడదని, పంటలు ఎండిపోకుండా అవసరమైన మేరకు నీటి సరఫరా జరిగేలా చర్యలు కొనసాగుతాయని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి గోదావరి జలాలను విడుదల చేయించడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తూ మంత్రి తుమ్మలకు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రభుత్వంపై యుద్ధం తప్పదు

**ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ**
**ప్రభుత్వం మెడలు వంచి వికలాంగుల పింఛన్లు సాధిస్తాం**
**త్వరలోలక్షలాది మంది వికలాంగులతో భారీ బహిరంగ సభ**
**వికలాంగుల హక్కుల సమితి జాతీయ కార్యవర్గ సమావేశంలో మంద కృష్ణ మాదిగ**



**ఖమ్మం, ప్రతినిధి సెప్టెంబర్ 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** వికలాంగుల సమస్యలు పరిష్కరించుకుంటే ప్రభుత్వంతో యుద్ధం తప్పదని,తెలంగాణ ప్రభుత్వం వికలాంగుల పింఛన్ పెంపదలలో నిర్లక్ష్యం వహిస్తుందని ఏపీ ప్రభుత్వం వికలాంగుల పట్ల చూపిన చొరవ తెలంగాణ ప్రభుత్వం చూపటం లేదని వికలాంగుల పట్ల ఏపీ ప్రభుత్వానికి ఉన్న నిబద్ధత తెలంగాణ ప్రభుత్వానికి లేదని ఎంఆర్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు,వికలాంగుల ఆత్మబంధువు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అన్నారు.ఖమ్మం లోని ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్లో సోమవారం జరిగిన జాతీయ వికలాంగుల కార్యవర్గ సమావేశం రాంబాబు అధ్యక్షతన జరిగిన జాతీయ కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.వికలాంగుల పింఛన్ పెంచకుండా ఉంటే భవిష్యత్తులో పెద్ద ఉద్యమాలు నిర్మించి ప్రభుత్వ మెడలు వంచి వికలాంగులు పెంపుదల సాధిస్తామని వికలాంగుల కు ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. పెన్షన్ మీద ఆధారపడే ప్రతి ఒక్క వికలాంగులు పెన్షన్ దారులు మరో ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఇప్పటివరకు పెంచుతారని వేచి చూశాము కానీ పెన్షన్ దారులను వంచిస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్తాం అన్నారు. మరో ఉద్యమానికి రంగం సిద్ధం చేస్తామని ప్రభుత్వంతో సమసిద్ధమని తెలుసుకోవడానికి త్వరలో పూర్తి కార్యక్రమం ప్రకటిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ విహెచ్ పి ఎస్ కోర్ కమిటీ చైర్మన్ ఎల్ ఎల్ గోపాల్ రావు,కోర్ కమిటీ చైర్మన్అంధీ రాంబాబు, మారేడు పూడి రమేష్ బాబు ,జీవరత్నం ఖమ్మం జిల్లా అధ్యక్షులు , సుజాత సూర్యవంశంజాతీయ అధ్యక్షురాలు, భవాని చౌదరిజాతీయ మహిళా అధ్యక్షురాలు, గడ్డం కాసింతెలంగాణ జాతీయ ప్రధాన కార్యదర్శి , కర్ల విజయరావు జాతీయ కార్యదర్శి, కుమారిజాతీయ మహిళ నాయకులు (ఏపీ) కళ్ళ జంగయ్యతెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు చిన్న సుబ్బయ్య అధ్యక్షులు డేవిడ్ రాజుఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లీశ్వరిఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, గాలి ముట్టి కిరణ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ,రాళ్లపల్లి నరేందర్ వీకే నరసింహ, పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బాబోయ్ ఈ హాస్టల్‌కి తిండి మాకొద్దు.

**- అధికారుల పర్యవేక్షణ కరువు.**

**- ముక్కిన బియ్యము,బియ్యం లో పాకుతున్న పురుగులు, తుట్టెలు పట్టిన పల్లీలు, దుర్గంధ భరితంగా లోనికి వెళ్లలేని బాత్రూంలు.**

**- దినదిన గండంగా బతుకును వెల్లదీస్తున్న బాలికల దీనస్థితి ఇది.**

**- గుర్తుర్ గ్రామ సర్పంచ్ వి. కవిత బాలకృష్ణ హాస్టల్ ను సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు.**









**తొర్రూరు ప్రతినిధి, సెప్టెంబర్ 7(పిసిడబ్ల్యూ న్యూస్):** ఎందరో విద్యార్థినిలు చదువుల కోసం దూరప్రాంతాల నుండి వచ్చిన వారు ఎందరో ఉన్నారు. దూర ప్రాంతంలో ఉన్న పాఠశాలలో విద్యానభ్యసించి స్వగ్రామాలకు వెళ్లలేని పరిస్థితుల్లో వసతి గృహాల్లో చేరుతుంటారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా వసతి గృహాలలో ప్రతి ఒక్కరికి అన్ని సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పుకోవటమే తప్ప వసతి గృహాల్లో ఉండే పరిస్థితిని చూస్తే అందులోని విద్యార్థినులు దినదిన గండం గా కాలం వెళ్లదీస్తున్నారు అనటానికి ఈ వసతి గృహమే నిదర్శనం.ప్రతి మూడవ శనివారం పాఠశాలను తనిఖీ చేయాల్సిన బాధ్యతగా గ్రామ సర్పంచులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేశారు. అందులో భాగంగా సోమవారం గుర్తుర్ గ్రామ సర్పంచ్ వి .కవిత బాలకృష్ణ బాలికల ఆదర్శ వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.తనకి లో భాగంగా బాలికలు పడుతున్న అవస్థలు వారి దీన గాథలను సర్పంచికి తెలుపుకుంటూ వారి బాధలను వెళ్ళబుచ్చారు. ముక్కిన బియ్యం, బియ్యం లో పురుగులు, తుట్టెలు పట్టిన పల్లీలు, సరిగా నీళ్లు లేక బాత్రూంలో శుభ్రం చేసేవారు కరువై బాత్రూంలోకి వెళ్లాలంటేనే దుర్గంధ భరితం అందులోనే వారు వెళ్లాల్సిన పరిస్థితి. ఎవరికి చెప్పుకోలేని బాధలు వసతి గృహాన్ని పరిశీలించని అధికారులు, తాగునీటి కొరత వారి మనసులోని బాధలను గ్రామ సర్పంచ్ కవితా బాలకృష్ణకు వెల్లడించి కన్నీరు పర్యంతం అయ్యారు. ఈ విషయాలపై గ్రామ సర్పంచ్ కవితా బాలకృష్ణ హాస్టల్ వార్డెన్ వివరణ కోరగా బయటికి వెళ్ళడైన విషయాలు ఈ విధంగా ఉన్నాయి. బాత్రూంలు శుభ్రపరిచేందుకు ఎవరూ లేకపోవడంతో ఏమి చేయలేని పరిస్థితిలో ఉన్నామని వెల్లడించారు. ఇదే కాకుండా బియ్యంలోని పురుగుల విషయానికి వస్తే శుభ్రపరిచేందుకు ఎవరు కూడా లేరని అలాంటి పరిస్థితుల్లో అలాగే వండి విద్యార్థులకు అందించటం జరుగుతుందని సర్పంచికి వివరించారు. వి కవిత బాలకృష్ణ త్వరలో విద్యార్థినుల కోసం మినరల్ వాటర్ ను ఏర్పాటు చేస్తామని ఇప్పటినుండి అన్ని రకాల సౌకర్యాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అన్ని విధాలుగా మీకు అందిస్తామని వారు పేర్కొన్నారు. హాస్టల్లో పనిచేసే వర్కర్ మహిళ కూడా విద్యార్థులను నోటికి వచ్చినట్లుగా బూతు మాటలు తిడుతుందని విద్యార్థులు ఈ విషయాన్ని వెలుగులోకి తీసుకువచ్చారు. సదరు మహిళా వర్కర్ ని గ్రామ సర్పంచ్ మందలించి మరోసారి ఇలాంటి మాటలు మాట్లాడటం మానివేయాలని తెలిపారు. ఇది ఇలాగే కొనసాగుతే వర్కర్ గా మరో మహిళను ఏర్పాటు చేయాల్సి ఉంటుందని కూడా హెచ్చరించారు. నిరుపేద కుటుంబంలో నుండి వచ్చిన విద్యార్థినిలు వసతి గృహాల్లో పడుతున్న కష్టాల్ని భరించుకుంటూ అటు తల్లిదండ్రులకు చెప్పుకోలేక చెప్పుకోవాలని అధికారులు పట్టించుకోవడం లేక వాళ్లతో పడుతున్న బాధలను ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే వసతిగృహంలో అన్ని రకాల ఏర్పాట్లను చేయాల్సిందిగా విద్యార్థినులు కోరుతున్నారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండల కేంద్రంలోని గుర్తురు గ్రామపంచాయతీలో గల ఆదర్శ పాఠశాల పరిస్థితి ఇది. చుట్టూ పిచ్చి మొక్కలు గడ్డితో దోమల బాధతో భరించలేక స తమాతమవుతున్నామని వసతి గృహం చుట్టూ గడ్డి మందులు చల్లించే ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు. ఇప్పటికైనా బాలికల ఆదర్శ వసతి గృహాన్ని అధికారులు స్పందించి వెంటనే అన్ని రకాల సదుపాయాలను కల్పించే విధంగా చూడాలని స్థానికులు కూడా కోరుతున్నారు.

# "తెలంగాణ రాజ్యాధికార పార్టీ" జిల్లా అధ్యక్షుడిగా దామళ్ళ సత్యం






**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 7 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టిఆర్పి) ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా దామళ్ళ సత్యనారాయణ నియమితులయ్యారు. గత 20 ఏళ్లుగా క్రియాశీలక రాజకీయాల్లో కొనసాగుతున్న ఆయనకు వివిధ రాజకీయ, సామాజిక ఉద్యమాల్లో పనిచేసిన అనుభవం ఉంది. గతంలో బీఎస్పీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా, తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వహించారు. విద్యార్థి, సామాజిక, రాజకీయ రంగాల్లో చురుకైన పాత్ర పోషించిన ఆయనను తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియమించడం పట్ల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. జిల్లాలో పార్టీని బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యలపై మరింత చురుగ్గా పనిచేస్తానని సత్యనారాయణ తెలిపారు. **-మల్లన్నకు కృతజ్ఞతలు..** తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన పార్టీ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు తీన్మార్ మల్లన్నకు దామళ్ళ సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నిర్మాణానికి కృషి చేస్తానని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు.